
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఖమ్మం

5

శనివారం, 7 డిసెంబరు 2024

భద్రాద్రి జడ్పీ సీఈవోగా నాగలక్ష్మి



చుంచుపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జడ్పీ సీఈవోగా బి.నాగలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం జడ్పీ డిప్యూటీ సీఈవోగా పని చేసిన నాగలక్ష్మి పదోన్నతిపై భద్రాద్రి జిల్లాకు సీఈవోగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. నూతన సీఈవోకు కార్యాలయం అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో కె.చంద్రశేఖర్, కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.













ప్రగతి సౌరభం.. సంక్షేమ సంబురం

ప్రజలు కోరిన పాలన

కాంగ్రెస్ సర్కారు ఏడాది పాలనలో ఎన్నో మార్పులు

- మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతి పథకాలకు స్పందన
- రైతు రుణమాఫీ కింద వేలాది మందికి లబ్ధి
- సన్నధాన్యానికి రూ.500 బోనస్‌పై రైతుల హర్షం
- ఎట్టకేలకు సీతారామ ఎత్తిపోతల పథకానికి మోక్షం
- గోదావరి జలాలతో కృష్ణా జలాల అనుసంధానం
- భద్రాచలంలో చురుగ్గా కరకట్ట పనులు
- ఆయిల్‌పామ్‌కు ప్రోత్సాహకాలు
- మున్నేరుకు ఇరువైపులా రక్షణ గోడలు
- ఖమ్మంలో ప్రభుత్వ వైద్యకళాశాల, పాలేరులో జేఎన్టీయూకు భారీగా నిధుల మంజూరు
- మూడు ప్రతిష్ఠాత్మక ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల మంజూరు
- పరిష్కారం కావాల్సినవి ఇంకా ఎన్నో...

ఖమ్మం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి శనివారంతో ఏడాది పూర్తవుతోంది. గడచిన ఏడాది కాలంలో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అనేక పెండింగ్ సమస్యలు పరిష్కారం చూడగా, ఇంకా అనేక సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తూనే ఉన్నాయి. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఏర్పడిన ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ముగ్గురు మంత్రులకు జిల్లా నుంచి అవకాశం లభించింది. ఉపముఖ్యమంత్రిగా, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రిగా మల్లు భట్టి విక్రమార్క ప్రమాణం చేయగా, ఖమ్మం నుంచి గెలిచిన తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళిశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇక పాలేరు నుంచి గెలిచిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రిగా ప్రమాణం చేశారు. ఇలా రాష్ట్ర కేబినెట్‌లో ముగ్గురికి కీలక స్థానాలు లభించాయి.

ప్రజాపాలనలో సంక్షేమం

ప్రజాపాలనలో ఆరుగ్యారంటీల కింద జిల్లాలో మహాలక్ష్మి పథకం కింద జీరో టికెట్‌తో ఉచిత బస్సు ప్రయాణం జిల్లాలో మహిళలు అందుకుంటున్నారు. అలాగే రూ.500కే గ్యాస్‌సిలిండర్‌ను జిల్లాలో 2,29,034 మంది 6,25,974 గ్యాస్ సిలిండర్లను అందుకున్నారు. జిల్లాలో రూ.17.51 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. గృహజ్యోతి కింద జిల్లాలో రూ.2,49,722 మంది లబ్దిదారులు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందుతున్నారు. రూ.70.09 కోట్లు ఉచిత విద్యుత్ కింద ప్రభుత్వం జమచేసింది. జిల్లాలో ఇప్పటివరకు రూ.500 బోనస్ కింద రూ.34 కోట్ల 47 లక్షలు... 6 కోట్ల 89 క్వింటాళ్లకు అందించారు. రైతురుణమాఫీ కింద జిల్లాలో మొదటి విడత 57,857 మందికి రూ.264.2 కోట్లు, రెండో విడత 33942 మంది రైతులకు రూ.262.50 కోట్లు, మూడో విడతలో 23,546 మంది రైతులకు రూ.245.85 కోట్లు, నాలుగో విడతలో 17852 మంది రైతులకు రూ.154.03 కోట్లు మాఫీ అయ్యాయి. అదేవిధంగా భద్రాద్రి జిల్లాలో కూడా రుణమాఫీ చేశారు. జిల్లాలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృషితో ఉమ్మడి జిల్లాలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

సీతారామ ప్రాజెక్టుకు మోక్షం

గతంలో రూ.13500 కోట్లతో నిర్మించి నిరుపయోగంగా ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా (మిగతా 6వ పేజీలో)



ఖమ్మంలో హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ సునిల్‌దత్

పోలీసుశాఖలో హోంగార్డుల సేవలు కీలకం

- పోలీసు కమిషనర్ సునిల్‌దత్
- ఘనంగా 62వ హోంగార్డు దినోత్సవం

వివరాలు : 6లో



ఖమ్మంలో మీడియా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ తాతా మధు, సండ్ర, కొండబాల

అక్రమ కేసులు, అరెస్టులకు భయపడం

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు పోరాటం
- బీఆర్ఎస్ నేతలు తాతా మధుసూదన్, సండ్ర వెంకటవీరయ్య

వివరాలు : 6లో

మెడికల్ కాలేజీ శంకుస్థాపన

రేపటికి వాయిదా

ఖమ్మం ఖానాపురం హవేలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో శనివారం జరగాల్సిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవన సముదాయం శంకుస్థాపన కార్యక్రమం ఆదివారానికి వాయిదా పడింది. నల్గొండలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు మంత్రి తుమ్మల వెళ్తుండటంతో ఖమ్మం కార్యక్రమం ఆదివారానికి వాయిదా పడినట్లు తెలిసింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నల్గొండకు ఇంచార్జ్ మంత్రిగా ఉన్న విషయం తెలిసిందే. ఈ నెల 8న వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా మెడికల్ కాలేజీ శంకుస్థాపన నిర్వహించనున్నారు. కాగా, శనివారం ఉదయం 9 గంటలకు మంత్రి తుమ్మల నగరంలోని మామిళ్లగుడెంలోని సారథినగర్ అండర్ బ్రిడ్జ్ ప్రారంభించి, 10 గంటలకు ఖమ్మం నుంచి మిర్యాలగుడ మీదుగా కోదాడ హుజూర్‌నగర్ రోడ్డు మార్గంలో వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి సాయంత్రం 5 గంటలకు నల్గొండ నుంచి ఖమ్మం బయలుదేరి రానున్నారు.

భద్రాద్రి జిల్లాకు 'నవోదయ'

కొత్తగూడెం అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏడు నవోదయ విద్యాలయాలను కేంద్రం ప్రకటించింది. కొత్తగూడెం, జగిత్యాల, నిజామాబాద్, మేడ్చల్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, సూర్యాపేటలో నవోదయాలను ఏర్పాటుచేయనుంది. విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన చదువును అందించేందుకు ఏర్పాటుచేయనున్న నవోదయ విద్యాలయాలు రాష్ట్రంలోని భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో ఏర్పాటుచేయనుంది. శుక్రవారం జరిగిన కేంద్ర క్యాబినేట్ సమావేశంలో ఈ మేరకు దేశవ్యాప్తంగా కొత్తగా 85 కేంద్రీయ విద్యాలయాలు, 28 నవోదయ విద్యాలయాలు ఏర్పాటుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏడు నవోదయ విద్యాలయాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు కేంద్రమంత్రి అశ్విన్ వైష్ణవ్ వెల్లడించారు.



పాలేరు జలాశయం

యాసంగికి సాగర్ నీటిపై కసరత్తు

- ఖమ్మంజిల్లాలో 2.54 లక్షల ఎకరాలకు 32టీఎంసీల నీరు
- ఆంధ్రాలోని మూడో జోన్‌కు 8టీఎంసీలు
- ప్రతిపాదనలు పంపిన అధికారులు
- వారబందీ పద్ధతిలో సరఫరా చేసే అవకాశం

కూసుమంచి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లాలో నాగార్జునసాగర్ రెండో ఆయకట్టులో యాసంగిసాగుకు నీటి విడుదలకు సంబంధించి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈమేరకు జిల్లాలో ఎంతనీరు అవసరమనే దానిపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఒకటి రెండు రోజుల్లో సమావేశమై నీటి విడుదలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. వానాకాలం పంట పూర్తి కావస్తుండటంతో.. యాసంగి సాగుకు రైతులు నార్లు పోసుకుని సాగుకు సిద్ధమవుతున్నారు. యాసంగికి నీరు సరఫరా చేస్తామని చెపుతున్నప్పటికీ షెడ్యూల్ ప్రకటించాల్సి ఉంది. ఎప్పటినుంచి ఎప్పటివరకు ఏ పద్ధతుల్లో నీరు సరఫరా చేస్తారో స్పష్టత రావాల్సి ఉంది.

వారబందీ ప్రకారం నీరువిడుదల

సాగర్ ఆయకట్టుకు వారబందీ (ఆన్ అండ్ ఆఫ్) పద్ధతి ప్రకారం సాగునీరు విడుదల (మిగతా 6వ పేజీలో)

దశాబ్దాల కల నెరవేరిన వేళ

- ఖమ్మంలో రైల్వే మినీ అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి
- మామిళ్లగూడెం-సారథినగర్ మధ్య అందుబాటులోకి..
- ఫలించిన మంత్రి తుమ్మల కృషి.. నేడు ప్రారంభోత్సవం
- రైలు పట్టాలు దాటుతూ ఇప్పటివరకు అనేక మంది మృతి
- 24 ఏళ్ల క్రితమే పోరాటం ప్రారంభించిన స్థానికులు
- ఎట్టకేలకు పూర్తి కావడంతో నగరవాసుల్లో ఆనందం



మంత్రి తుమ్మల కృషితో నిర్మించిన రైల్వే అండర్‌బ్రిడ్జి

ఖమ్మం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం నగరంలో మామిళ్లగూడెం-సారథినగర్ ప్రాంతాల మధ్య రైల్వేట్రాక్ వద్ద ఎట్టకేలకు మినీ అండర్ బ్రిడ్జి (అండర్‌పాస్) అందుబాటులోకి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో దశలవారీగా మినీ అండర్ బ్రిడ్జి పనులు పూర్తయ్యాయి. దీంతో ఇరుప్రాంతాల ప్రజలు ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా రాకపోకలు సాగించే వీలు ఏర్పడింది. శనివారం ఈ మినీ బ్రిడ్జిని మంత్రి తుమ్మల ప్రారంభించనున్నారు.

ఖమ్మం నగరం మీదుగా వెళ్లే రైలు మార్గం.. నగరాన్ని రెండుగా విభజిస్తుంది. ఇక్కడి నుంచి విజయవాడ, వరంగల్, కాజీపేట వైపుగా ఉత్తర,దక్షిణ భారతాలను కలుపుతూ నిత్యం వందలసంఖ్యలో రైళ్లు నడుస్తుంటాయి. ఇక్కడ ట్రాక్‌కు ఇరువైపులా మామిళ్లగూడెం, సారథినగర్ ప్రాంతాలు ఉంటాయి. పాఠశాలలు మామిళ్లగూడెం వైపు ఎక్కువగా ఉండడంతో నిత్యం విద్యార్థులు, ప్రజలు సారథినగర్‌నుంచి మామిళ్లగూడెం వైపు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. రైల్వే ఓవర్‌బ్రిడ్జి ఉన్నా అది దూరం ఎక్కువకావడంతో ప్రజలు రైలు పట్టాలపై నుంచే వచ్చివెళ్లే వారు. ఈ క్రమంలో రైల్వే సిగ్నల్స్ సైరన్లు గుర్తించక అనేక మంది రైలు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయారు.

దీంతో ప్రమాదాలను అరికట్టడానికి మినీ అండర్ బ్రిడ్జి నిర్మాణం ఒక్కటే పరిష్కారమని స్థానికులు 24 ఏళ్ల క్రితమే పోరాటం మొదలుపెట్టారు. అనేక మంది ప్రయత్నాలు సాగించినా ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో 2009లో ఖమ్మం ఎమ్మెల్యేగా గెలిచిన తుమ్మల నాగేశ్వరరావు మినీ అండర్ బ్రిడ్జిని మంజూరు చేయించారు. 2013లో శంకుస్థాపన చేయించారు. (మిగతా 6వ పేజీలో)

నా బిడ్డను పోగొట్టుకున్నా...

మామిళ్లపల్లి నాగేంద్రచారి, సారథినగర్



మామిళ్లగూడెం, సారథినగర్ మధ్య బ్రిడ్జిలేకపోవడంతో అనేక ఏళ్లుగా పెద్దలు, పిల్లలు చనిపోయారు. నా కూతురు ప్రియాంక 2000వ సంవత్సరంలో మామిళ్లగూడెంలోని స్కూల్‌కు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో రైలు ఢీకొని మరణించింది. ఆనాటి నుంచి ఇప్పటి వరకు నేను రైలు పట్టాలపై వెళ్లలేదు. ఇప్పుడు అండర్ బ్రిడ్జి ప్రారంభోత్సవం కానుండటంతో సంతోషంగా ఉంది. ఇక నుంచి రైలు పట్టాలపై వెళ్లే పరిస్థితి ఎవరికీ ఉండదు.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్టు



- రూ.8.68 లక్షల విలువ గల సొత్తు స్వాధీనం
- ఆత్కూరు సర్కిల్‌లో తనిఖీల సందర్భంగా పట్టివేత

8

గట్టెక్కిన భద్రాద్రి కష్టం



- ఎట్టకేలకు అందుబాటులోకి శాశ్వత డంపింగ్ యార్డు
- మనుబోతుల చెరువు సమీపంలో 8.5 ఎకరాల్లో ఏర్పాటు

6

గట్టెక్కిన భద్రాద్రి కష్టం

ఎట్టకేలకు అందుబాటులోకి శాశ్వత డంపింగ్ యార్డు



యంత్రాలను ప్రారంభిస్తున్న దృశ్యం

భద్రాచలం డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి వాసులకు గత దశాబ్దకాలంగా డంపింగ్ యార్డు లేక ఎదురవుతున్న కష్టాలు ఎట్టకేలకు తీరనున్నాయి. భద్రాచలం పట్టణంలో శాశ్వత డంపింగ్ యార్డు మనుబోతుల చెరువు సమీపంలో ఏర్పాటు చేయడంతో సమస్యకు పరిష్కారం లభించినట్లయ్యింది. పట్టణంలో సేకరించిన తడి, పొడి చెత్తలను ఐటీసీ వావ్ సంస్థ సహకారంతో గ్రామ పంచాయతీ రూ.1.30 కోట్లతో ఐదు యంత్రాలను ఏర్పాటు చేయడంతో భద్రాద్రివాసులకు ఊరట లభించనుంది. ఇందుకు సంబంధించిన సాంకేతిక పనులు ఇప్పటికే పూర్తికావడంతో శుక్రవారం తడి, పొడి చెత్తలను పొడిగా మార్చే ప్రక్రియ ప్రయోగాత్మకంగా ప్రారంభమైంది. కొన్ని రోజుల పాటు ఈ ప్రక్రియ సాగనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

తీరిన కష్టాలు

పోలవరం ముంపు మండలాల పేరుతో ఉమ్మడి జిల్లాలోని ఏడు మండలాలు ఏపీలో విలీనం అనంతరం భద్రాద్రి కరకట్టే డంపింగ్ యార్డుగా మారిన దుస్థితి. దీంతో గత దశాబ్దకాలంగా ఆ ప్రాంతం నిత్య అగ్నిహోత్రంగా మారింది. ఈ పరిస్థితికి శాశ్వత పరిష్కారం దశాబ్ద కాలం తరువాత లభించిం ది. మనుబోతుల చెరువు సమీపంలో డంపింగ్ యార్డు పనులు పూర్తవడంతో యంత్రాల ద్వారా చెత్తను పొడిగా మార్చే ప్రక్రియను చేపడుతున్నారు. భద్రాచలంలోని మనుబోతుల చెరువు సమీపంలో 8.5 ఎకరాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. ఇందులో 1.5 ఎకరాల్లో డ్రై వేస్ట్ రిసోర్సు కలెక్టింగ్ సెంటర్(బీఆర్‌సీసీ)ని ఏర్పాటు చేయగా ఇందుకోసం రూ.80 లక్షలు వెచ్చించారు.

పొడి చెత్తను వేరు చేసి క్రష్ చేసే మిషన్‌ను బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారానికి చెందిన వావ్ స్వచ్ఛంద సంస్థ గ్రామ పంచాయతీకి అందజేసిం ది. కాగా తడిచెత్తను క్రష్ చేసే మిషన్‌ను రూ.70 లక్షలతో భద్రాచలం గ్రామ పంచ్యాయతీ కొనుగోలు చేసింది. కాగా మిగిలిన ఏడు ఎకరాల్లో భారీగా మొక్కలను పెంచనున్నారు.

రాష్ట్రంలో తొలి గ్రామ పంచాయతీ

ఆధునిక యంత్రాలతో తడి, పొడి చెత్తను పొడిగా మార్చే విధానం ప్రవేశపెట్టింది రాష్ట్రంలో తొలి గ్రామ పంచాయతీ భద్రాచలమే కావడం విశేషం. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన పీర్జాదిగూడ మున్సిపాల్టీలో ఇదే రీతిన డీఆర్‌సీసీసీని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అక్కడ డంపింగ్ విధానం అమల్లో ఉంది. తాజాగా భద్రాచలం గ్రామ పంచాయతీలో సైతం ఇదే విధానం అధికారులు అమలు చేస్తున్నారు.

ప్రతి రోజు 15 టన్నుల చెత్త సేకరణ

భద్రాచలం గ్రామ పంచాయతీలో మొత్తం 20 వార్డుల్లో సుమారు 16 వేల ఇళ్ల సముదాయాలుండగా 85 వేల జనాభా ఉంది. 27 వాహనాల ద్వారా ప్రస్తుతం 15 టన్నుల తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు నూతన డంపింగ్ యార్డులో యంత్రాలతో పనులు అధికారికంగా పనులు ప్రారంభం అనంతరం చెత్త సేకరణ మరింత వేగవంతం కానుంది.

ఇందుకోసం అదనంగా మరో ఐదు వాహనాలను వినియోగించనున్నారు. నూతన డంపింగ్ యార్డు వద్ద పనులు ప్రారంభమైన అనంతరం అందులో పని చేసేందుకు సుమారు 60 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

రామసేవలో రాజిల్లినావయ్యా...

- లక్ష్మీ నరసింహదాసు నరసింహదాసు వెబ్‌సైట్ ప్రారంభం
- నరసింహదాసు ఆంగ్ల, తెలుగు సచిత్ర పుస్తక, సీతాచాలీసా పుస్తక ఆవిష్కరించిన ఈవో
- నేమాని పార్థసారథికి సత్కారం
- ఘనంగా తూము లక్ష్మీనరసింహదాసు జయంతి



భద్రాచలంలో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలంలో ఉత్సవాలనే కాకుండా భక్తరామదాసు ఏర్పాటు చేసిన భజన సంప్రదాయంతో ఉత్సవాలకు మరింత వన్నె తెచ్చిన వారు ఉత్సవాలకు తగిన కీర్తనలు కూడా రచించి వాగ్గేయకారుడిగా నిలిచిన ధన్యజీవి రాజా తూము లక్ష్మీనరసింహదాసు. అటువంటి మరో రామదాసును సంస్మరించుకుంటూ శుక్రవారం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రాజా తూము లక్ష్మీనరసింహదాసు 234వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తూములక్ష్మీనరసింహదాసు చిత్రపటంతో మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఈ క్రమంలో విస్తా కాంప్లెక్సు వద్ద తూము లక్ష్మీనరసింహదాసు విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్త రామదాసు విగ్రహం వద్ద సైతం పూజలు చేశారు. గిరి ప్రదక్షిణ అనంతరం రామాలయానికి చేరుకున్నారు. తూము లక్ష్మీనరసింహదాసు పేరిట భద్రాద్రి రామయ్యకు అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా తెలుగు, ఆంగ్ల భాషల్లో లక్ష్మీనరసింహదాసు సచిత్ర పుస్తకాలను భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఆవిష్కరించారు. శ్రీ సీతా చాలీసా, తూము లక్ష్మీనరసింహదాసు పేరిట రూపొందించిన తూము నరసింహదాసు.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌ను ఈ సందర్భంగా పారంభించారు.

పార్థసారథికి సత్కారం

ప్రసిద్ద నేపథ్య గాయకుడు నేమాని పార్థసారథికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. చిత్రకూట మండపంలో తూము లక్ష్మీనరసింహదాసు జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను దేవస్థానం ఈవో రమాదేవి, తూము లక్ష్మీనరసింహదాసు వంశీకులు, ఘనంగా సత్కరించారు. ఈ సమయంలో పార్థసారథి తూము నరసింహదాసు కీర్తనలను ఆలపించగా అవి భక్తులను భక్తి సాగరంలో ముంచెత్తాయి. ఈ సందర్భంగా చెన్నైకు చెందిన శాస్త్రీయ సంగీత బృందం సంగీత ఆరాధన ఎంతో ఆకట్టుకుంది. వేంపటి శ్యామల నరసింహదాసు కీర్తనలు ఆలపించారు.

డా. జీఎల్‌కే దుర్గ బృందంచే సీతా చాలీసా పారాయణం నిర్వహించారు. మాస్టర్ మహిదర్ కోలాట బృంద నృత్యం, నల్లాన్ చక్రరత్నుల జయశ్రీ లాస్య నృత్యం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవోలు శ్రవణ్‌కుమార్, భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, తూము నరసింహదాసు వంశస్తులు తూము చంద్రశేఖర్, తూము మనోహర్, లక్ష్మణ్, రవిరాజ్, రమణ, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, కోటి రామస్వరూప్ రాఘవాచార్య, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, పాల్గొన్నారు.

ఎమర్జెన్సీని తలపిస్తున్న కాంగ్రెస్ పాలన

- హామీలు అమలు చేయలేని స్థితిలో రేవంత్ ప్రభుత్వం
- కాంగ్రెస్ సభలా మారిన ఫుడ్ పార్కు ప్రారంభోత్సవం
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారు
- బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



చెక్కును అందజేస్తున్న సండ్ర

సత్తుపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులతో వేధిస్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో ప్రమాదవశాత్తూ మరణించిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు శుక్రవారం ఆయన బీమా చెక్కులు అందజేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సండ్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలన ప్రజలకు తెలుసునన్నారు. కేసీఆర్ అధికారంలో లేని లోటు ప్రజలకు స్పష్టంగా తెలుస్తోందన్నారు. భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఒక వ్యూక్య రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంక గాంధీలు రాజ్యాంగం పుస్తకం పట్టుకొని ఢిల్లీలో ఆందోళన చేస్తోంటే మరో పక్క మన రాష్ట్రంలో హౌస్ అరెస్టు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని అన్నారు. 125 అడుగుల ఎత్తున్న అంబేద్కర్ విగ్రహం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేసారని, అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించేందుకు వెళుతున్న నాయకులను ఈ ప్రభుత్వం అరెస్టులు చేస్తోందన్నారు. బాధితుల పక్షాన పోరాడుతున్న వారిని హౌస్ అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు.

తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్పట్లో పాదయాత్ర చేసారని అయినా బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమీ అడ్డంకులు సృష్టించలేదన్నారు. కాని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అక్రమ కేసులతో వేధిస్తున్నారని ఆరోపించారు.

నియంతృత్వ దోరణి అవలంబిస్తూ ప్రజాస్వామాన్ని కాలరాసే విధంగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పుకుంటూ ఉన్న సర్వీసులు తగ్గించారని అన్నారు. భూమి నిరుపేదలకు రూ.2500 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఇవ్వలేదని అన్నారు. వ్యవసాయ కూలీలు, కౌలు రైతుల ఇచ్చిన హామీ అమలు చేయలేదని అన్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్లు పెంచుతామని చెప్పి ఆయా వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ఇచ్చిన నోటిఫికేషన్లకే ఉద్యోగ నియామకాలు చేస్తున్నారని అన్నారు. ఫుడ్ పార్కులో రెండేళ్లుగా నడుస్తున్న ఒక చిన్న పరిశ్రమకు మంత్రులు మళ్లీ ప్రారంభోత్సవం చేసారని అన్నారు. ఫుడ్ పార్కు ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన సభ అధికారిక సభ అయితే కాంగ్రెస్ పార్టీ సభలాగా నిర్వహించారని అధికారులు చేష్టలుడిగి చూడాల్సి వచ్చిందన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘన ఏ రకంగా జరిగిందో అందరూ అర్ధం చేసుకోవాలని అన్నారు. ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడుమామిళ్లపల్లి కృష్ణయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కూసంపూడి రామారావు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పాలకుర్తి సునీత, బీఆర్ఎస్ నాయకులు కొడిమెల అప్పారావు, దొడ్డా శంకరరావు, మోదుగు పుల్లారావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, జువ్వాజి అప్పారావు, పత్తిపాటి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితో మహిళలు ముందడుగు వేయాలి

- కవి, గాయకుడు జయరాజు



ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో మహిళలు ముందడుగు వేయాలని ప్రజాకవి, గాయకుడు జయరాజు పేర్కొన్నారు. శుక్రవారం భక్తరామదాసు కళాక్షేత్రంలో వీరనారీమణుల ఆశయసాధన సమితి ఆధ్వర్యంలో 'రాజ్యాధికారి మహిళా రిజర్వేషన్లు- బహుజన మహిళల కర్తవ్యాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన జయరాజు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహిళల అభివృద్ధికి కోసం తన గురువు పూలే స్ఫూర్తితో ఉద్యమించడంతో పాటు రాజ్యాంగబద్ధ హక్కులు మహిళలకు, పురుషులతో సమానంగా కల్పించారని అన్నారు. వీరనారీమణుల ఆశయ సాధనసమితి సలహాదారులు విజయకుమారి మాట్లాడుతూ మన రాష్ట్రంలో సగం కన్నా ఎక్కువగా మహిళే ఓటర్లే ఉన్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ గ్రీష్మ, చల్లపల్లి స్వరూపరాణి, భూక్యా ఉపేంద్రబాయి, ఎస్సీఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజాసంఘల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ భద్రునాయక్ పాల్గొన్నారు.

పౌరహక్కుల సంఘాలకు వ్యతిరేకంగా

ఆదివాసీల ర్యాలీ



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

చర్ల, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం పౌరహక్కుల సంఘాల నాయకులకు వ్యతిరేకంగా వందలాది మంది గిరిజనులు, ఆదివాసీ సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత చర్ల వద్ద సంఘాల నేతల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అమాయక ఆదివాసీ, దళిత బిడ్డలైన ఉయిక రమేష్, అర్జున్, బాడిస మాస, ఇల్లందుల యేసు, పల్లెపాటి రాధను అతికిరాతకంగా మావోయిస్టులు హత మార్చితే పౌరహక్కుల సంఘాల నాయకులకు కనబడ్డం లేదా అని ప్రశ్నించారు. కనీసం నాయకులు స్పందించారా.. అని ప్రశ్నించారు. ఎదురు కాల్పుల్లో మావోయిస్టులు చనిపోతే ఎందుకు హడావుడి చేస్తున్నారని ప్రశ్నించారు. ఆదివాసీలపై దాడులు ఆపాలని, గిరిజన చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రగతి సౌరభం.. సంక్షేమ సంబురం..

(5వ పేజీ తరువాయి)

గోదావరి జలాలను మంత్రి తుమ్మల చొరవ తీసుకుని ట్రయల్ రన్ పూర్తి చేయించి ఆగస్టు 15నాడు సీతారామ మూడు ఎత్తిపోతల లిఫ్టుల ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. ఇందుకోసం జూలూరుపాడు నుండి ఏన్కూరు సాగర్ కాలవకు 8 కి.మీ. పొడవున రూ.90 కోట్లతో రాజీవ్‌లింక్ కెనాల్ మంజూరుచేయించి పనులు పూర్తిచేశారు. తద్వారా గోదావరి జలాలు కృష్ణాకు అనుసంధానమయ్యాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసంపూర్తిగా వదిలేసిన సీతారామకు ఈప్రభుత్వ హయాంలో మోక్షం లభించింది. మిగిలిన పనులకు టెండర్లు పూర్తిచేయించారు. 2026 నాటికి సీతారామ ద్వారా పూర్తిఆయకట్టుకు నీరిచ్చే పనులకు టెండర్లు కూడా పిలిచారు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు కూడా చేపట్టబోతున్నారు.

భద్రాచలం వారధి గత దశాబ్దాకాలంగా అసంపూర్తిగా ఉండగా మంత్రి తుమ్మల చొరవ తీసుకుని పనులు పర్తిచేయించి గత శ్రీరామనవమి నాటికి రాకపోకలు సాగించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈపనులపై పర్యవేక్షణ లేకపోవడంతో అసంపూర్తిగా ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో పనులు పూర్తిగా జరిగి రెండో వారధి అందుబాటులోకి వచ్చింది. అలాగే భద్రాచలంలో కరకట్ట పనులు రూ.38కోట్లతో వేగంగా చేపట్టారు. భద్రాచల ఆలయ అభివృద్ధికి రూ.60 కోట్ల నిధులు ఈప్రభుత్వం మంజూరుచేసింది. భూసేకరణకు ఈనిధులు ఖర్చుచేయబోతున్నారు. భద్రాచలం కేంద్రంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఈ ఏడాది మార్చి 11న శ్రీకారం చుట్టారు.

అశ్వారావుపేట నియోకవర్గంలో గండిపడిన పెదవాగుకు రూ.10కోట్లు మంజూరుచేయించి రింగ్‌బండ్ నిర్మించారు. పెదవాగు ప్రాజెక్టు పునర్ నిర్మాణానికి ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. అప్పారావుపేట ఆయిల్‌పామ్ పరిశ్రమలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని మంత్రి తుమ్మల చొరవ తీసుకుని ప్రారంభింపచేశారు. దశాబ్దకాలంగా అసంపూర్తిగా ఉన్న సత్తుపల్లి ఫుడ్‌పార్కును మంత్రి తుమ్మల పూర్తిచేయించి రాష్ట్రపరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్ బాబు, మంత్ర తుమ్మల చేతులమీదుగా ప్రారంభించారు.

మున్నేరుపై తీగల వంతెనకు గత ప్రభుత్వ హయాంలో టెండర్లతో ఉండగా ఇద్దరు మంత్రులు చొరవ తీసుకుని వంతెన పనులు ప్రారంభింపచేశారు. అలాగే మున్నేరుపై వరద నివారణకోసం రూ.690 కోట్లతో పనులు ప్రారంభించారు . కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటి ఇరిగేషన్ టెండరు పనులు మున్నేరు గోడల నిర్మాణ పనులే. అలాగే ఖమ్మం నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి 30 ఎకరాల స్థలం కేటాయింపచేసి రూ.160 కోట్లు మంత్రి తుమ్మల మంజూరుచేయించారు. అధునాతన వసతులతో ఇప్పటికే కళాశాల పనులు మొదలయ్యాయి.

ఖమ్మం వ్యవసాయమార్కెట్‌ను మోడల్‌మార్కెట్‌గా రూ.150 కోట్లతో ప్రతిపాదించారు. రఘునాధపాలెం మండలానికి సాగర్ కాలవపై సాగునీటికి మంచుకొండవద్ద రూ.60 కోట్లతో నిధులు మంత్రి తుమ్మల మంజూరుచేయించారు. అలాగే ఖమ్మంలో స్వామినారాయణ ఇంటర్నేషనల్ స్కూలుతోపాటు ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుచేయించారు. ఖమ్మం నగరంలో రోడ్డు, డ్రెయినేజీ పాలేరు నియోజకవర్గంలో మద్దులపల్లి వద్ద జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి రూ.108.60 కోట్లు మంజూరుచేయించారు. రూ.300 కోట్లతో కళాశాల నిర్మాణానికి ప్రతిపాదలను చేయించగా త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

అలాగే కూసుమంచిలో జూనియర్ కాలేజీ, ఖమ్మంరూరల్ మండలంలో ఇంటిగ్రేటెడ్‌స్కూల్, సిమెంట్లు రోడ్లు మంజూరుచేయించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గంలో పెద్దఎత్తున నిధులు మంజూరుచేయించి రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వెయ్యికోట్లతో శంకుస్థాపనలు చేశారు. మధిరలో రూ.47 కోట్లతో ఇండస్ట్రియల్ పార్కు, ఎర్రుపాలెంలో రూ.50 కోట్లతో ఇండస్ట్రియల్ పార్కు, ఎర్రుపాలెంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ రూ.340కోట్లతో మంజూరుచేయించారు. రూ.350 కోట్లు ఇంటర్నల్ రోడ్లకు మంజూరుచేయించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 నాడు వైరా కేంద్రంనుంచి మూడో విడత రైతురుణమాఫీకి శ్రీకారం చుట్టారు.

మున్నేరు బాధితులకు భరోసా

గతంలో ఎన్నడులేనివిధంగా మున్నేరు, ఆకేరు, పాలేరు వంటి ఏర్లు భారీవర్షాలతో పొంగడంతో ఖమ్మం , పాలరు, మధిర నియోజకవర్గాల్లో సుమారు 15 వేల కుటుంబాలు వరదకు గురయ్యాయి. వేలాది ఎకరాల్లో పంటల నష్టం జరిగింది. జరిగిన నష్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తదితరులు పరిశీలించారు. వరదల సమయంలో ముగ్గురు మంత్రులు జిల్లా అధికారులకు బాదితులకు భరోసాగా నిలిచారు.సకాలంలో అండగా ఉండి సహాయం అందించారు. రైతులకు ఎకరానికి రూ.10 వేల వంతున పరిహారం చెల్లించగా ఇల్లు దెబ్బతిన్న బాదితులకు కూడా సహాయం అదించారు.

ఇంకా సమస్యలెన్నో..

ఉమ్మడిజిల్లాలో అభివృద్ధికి ఇంకా అనేక సమస్యలు పరిష్కారానికి చూస్తున్నాయి. ఖమ్మంలో యూనివర్సిటీ, కొత్తగూడెంలో సైన్స్ యూనివర్సిటీ, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు మంజూరు కావాల్సి ఉంది. జమలాపురం, భద్రాచలం ఆలయాల అభివృద్ధికి నిధులు కేటయించి అభివృద్ధి చేయాలి.

పాలేరు నుంచి పర్ణశాల వరకు పర్యాటక అభివృద్ధికి నిధుల కేటాయింపు జరగాలి. ఖమ్మం ఖిల్లా, నేలకొండపల్లి బౌద్ధస్థూపంతో తోపాటు అనేక పర్యాటక పనులకు ప్రతిపాదనలు, నిధుల కేటాయింపులు జరిగాయి. నిధుల మంజూరు జరగాల్సి ఉంది. జిల్లాలో ముగ్గురు మంత్రులతో పాటు పర్యాటక మంత్రి కూడా ప్రదేశాలను తిలకించారు. కిన్నెరసాని అభయరాణ్యంతోపాటు పెనుబల్లి మండలం పులిగుండాలను పర్యాటక అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

యాసంగికి సాగర్ నీటిపై కసరత్తు

(5వ పేజీ తరువాయి)

చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. గతంలో ఈపద్ధతిలో నీరువిడుదల చేయడం ద్వారా రైతులు అధికా దిగుబడులు సాధించినట్లు గుర్తించారు. అప్పటి నుంచి వారబందీ ప్రకారం నీరు విడుదల చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు నీరు విడుదల, ఆరురోజులపాటు నిలుపుదల పద్ధతిలో పంపిణ చేశారు. దీంతో అధికాదిగుబడులు, రైతులు పొదుపుగా నీరు వాడుకునే అవకాశం ఉంది.

40 టీఎంసీలు అవసరమని ప్రతిపాదన

ఖమ్మంజిల్లాలో 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. దాంతో పాటు ఆంధ్రాలోని మూడ్వోజోన్ ఆయకట్టు నూజ్వీవీడు బ్రాంచ్ కెనాల్, నందిగామ 16, 17 కాల్వలకు సరఫరా చేయాల్సి ఉంది. అందుకు తగిన ప్రతిపాదనలు ఐబీ అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ఖమ్మంజిల్లా రెండోజోన్‌కు 32 టీఎంసీలు, ఆంధ్రాలోని మూడోజోన్ ఆయకట్టుకు 8 టీఎంసీలు నీరు అవసరమని ప్రతిపాదనలు పంపించారు. వీటితోపాటు ఖమ్మంజిల్లాలో మిషన్ భగీరధ ప్రాజెక్టు ద్వారా తాగునీటి అవసరాల నిమిత్తం ఎంత అవసరమో అంచనాలు సిద్ధం చేసి పంపినట్లు తెలిసింది. డిసెంబరు 25 నుంచి ఏప్రెల్ 5 వరకు నీరు విడుదల చేస్తే పంట చేతికి వస్తుందని అంచనా వేశారు. అదేవిధంగ చెరువుల్లో ఒకవేళ నీరు తగ్గినా వెంటనే నింప్కూకునే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. రెండు మూడురోజుల్లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.


దశాబ్దాల కల నెరవేరిన వేళ

(5వ పేజీ తరువాయి)

మొదట్లో రూ.70లక్షలతో పనులు ప్రారంభించారు. ఆతర్వాత 2014లో తుమ్మల ఓడిపోవడంతో బ్రిడ్జి పనులకు గ్రహణం పట్టింది. ఆ తర్వాత 2015లో ఎమ్మెల్సీగా, మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో బ్రిడ్జి పనుల్లో కదలిక తెచ్చారు. ఈ క్రమంలో 2016లో ఇతర పనులకు శంకుస్థాపన చేశారు. రైల్వే అధికారులు, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టారు. అయితే 2018లో ఓటమి చెందడంతో బ్రిడ్జి పనులు మళ్లీ ఆగిపోయాయి. గతేడాది తుమ్మల ఖమ్మం ఎమ్మెల్యేగా గెలిచి వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో బ్రిడ్జి పనులు ఊపందుకున్నాయి. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ నుంచి బ్రిడ్జి పనులు పూర్తిచేయించేందుకు రూ.కోటి 20లక్షలు మంజూరుచేయించి త్వరగా పనులయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం ప్రైవేటు స్థలం కూడా సేకరించారు. మంత్రి తుమ్మల ఎప్పటికప్పుడు చొరవ తీసుకొని ఏడాదిలోనే పనులు పూర్తిచేయించారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో శనివారం ఈ బ్రిడ్జికి తుమ్మల ప్రారంభోత్సవం చేస్తున్నారు. సారధీనగర్ బ్రిడ్జిపై కార్పొరేషన్ అధికారుల పలురకాల చిత్రాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

ప్రమాదాలను చూసి చలించా..

సింగం అజయ్య, మాజీ కౌన్సిలర్



నాకు ఊహ వచ్చిన దగ్గర్నుంచి అనేక మంది రైలు పట్టాలపై ప్రాణాలు కోల్పోయారు. ఆయా ప్రమాదాలను చూసి చలించా. ఇకపై ఎవరూ రైలు పట్టాలపై నడవకుండా ఉండాలని 1990లోనే నేను ఢిల్లీలోని రైల్వే మంత్రిత్వ శాఖకు లేఖ ఇచ్చా. నాటి నుంచి అనుమతుల రూపంలో చాలా సంవత్సరాలు గడిచి పోయాయి. ప్రస్తుత మంత్రి తుమ్మల నాగేశ్వరావు ప్రత్యేక చొరవతో రైల్వే అండర్ బ్రిడ్జి పనులు పూర్తి చేయించారు.

పోలీసుల పై దాడి చేసిన వారిపై కేసు నమోదు

మణుగూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణ ప్రాంతంలో మూడు రోజుల క్రితం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ రంజిత్, టీఎస్ఎస్పీ సిబ్బంది పై మణుగూరు ప్రాంతానికి చెందిన ఐదుగురు మద్యం మత్తులో పోలీసులను దుర్భాషలాడి దాడికి పాల్పడ్డారు. విధులకు ఆటంకం కల్గించిన వారిపై ఎస్ఐ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. దాడి చేసిన వారిలో కొరివి చంద్రశేఖర్, తక్కం గోపి చంద్, ముక్కర సాయికుమార్, చిటికెన రామకృష్ణ, నువ్వుల వంశీ ఉన్నట్లు పేర్కొన్నారు.

అక్రమ కేసులు, అరెస్టులకు భయపడం

బీఆర్ఎస్ నేతలు తాతా మధు, సండ్ర వెంకటవీరయ్య

ఖమ్మంటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసినా భయపడమని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు ప్రజల పక్షాన పోరాడతామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారని, ప్రజలకు ఏంచేశారో చెప్పేందుకు చర్చకు రావాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు, గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అరెస్టులు చేస్తున్నారన్నారు.

ఎవరో అనామకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావును అరెస్ట్ చేయటం, ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్లిన మరో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ఆయనపైనే కేసులు బనాయించి అరెస్ట్ చేయటం, అలాగే ఇదేమని అడిగిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డిని అరెస్ట్ చేయటం ఎమర్జన్సీ రోజులను గుర్తుకు తెస్తున్నదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా 126అడుగుల ఎత్తున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తే, వర్థంతిరోజు అక్కడ నివాళులు అర్పించకుండా అడ్డుకోవటం విచారకరమన్నారు. అక్రమ అరెస్టులు, కేసులతో భయపడేది లేదని వారు తేల్చి చెప్పారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న విధానాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. తగిన సమయంలో గుణపాఠం చెపుతారని వారు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అంబేద్కర్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా? అని ప్రశ్నించారు. తెలంగాణా తల్లి విగ్రహం విషయంలో రాజకీయం చేయటం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ నేతలకు జైళ్లు, కేసులు కొత్తకావని, కాంగ్రెస్ ఉవత ఊపుళ్లకు భయపడమన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఖమ్మం నగర, రూరల్ బీఆర్ఎస్ అధ్యక్షులు పగడాల నాగరాజు, బెల్లం వేణు, నాయకులు శీలంశెట్టి వీరభద్రం, ఉద్యమకారులు డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్‌చ లింగనబోయిన సతీష్, గుండ్లపల్లి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా..ఆరుగురికి గాయాలు

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడి ఆరుగురికి గాయాలు అయిన సంఘటన మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఆరుగురు కూలీలు ధాన్యం బస్తాలను ఆంధ్రాలోని వేలేరుపాడు మండలం మేడేపల్లికి చెందిన ఓ రైతు ఇంట్లో దిగుమతి చేసి వస్తున్నారు. ఆదే క్రమంలో కొత్తూరు సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో పిట్టా వీరభద్రంకు తీవ్రగాయాలు కాగా మిగిలిన వారికి స్వల్పంగా గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన వీరభద్రంను ఖమ్మం తరలించారు.

హోంగార్డుల సేవలు కీలకం

పోలీసు కమిషనర్‌సునిల్ దత్



బహుమతులు పొందిన మహిళా హోంగార్డులతో సీపీ

ఖమ్మంక్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డుల సేవలు కీలమని పోలీసుకమిషనర్ సునిల్‌దత్ అన్నారు. 62వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన సీపీ ముందుగా సాయుధ హోంగార్డుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం హోంగార్డుల కవాతు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో ఒక భాగమై పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వహిస్తూ హోంగార్డు ఆఫీసర్లు అందిస్తున్న సేవలు గొప్పవని కొనియాడారు. ఇటీవలే వచ్చిన భారీవరదల సమయంలో కొంతమంది హోంగార్డుల ఇళ్లువరద తాకిడికి గురై ఇబ్బందులో ఉన్నా అంకితభావంతో విధుల్లో నిమగ్నమయ్యారన్నారు. ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల బందోబస్తులో సైతం నిబద్ధతతో పాల్గొన్నారన్నారు. హోంగార్డుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం స్పోర్ట్స్ మీట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావు, కుమారస్వామి, ఏసీపీలు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడికేసులో 10 ఏళ్ల జైలు

ఖమ్మంలీగల్,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడి ఘటనలో పదేళ్ల జైలు శిక్ష విధించారు. ఈమేరకు జిల్లాపోక్స్ కోర్టు-2 ఇన్ చార్జ్ కోర్టు న్యాయాధికారి, మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. నేలకొండపల్లి మండలానికి చెందిన నిందితుడు బాణోత్ దీప్లా, బాలికపై 2021లో లైంగిక దాడి చేశాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.డి. ఇర్షాద్,లైజన్‌ఆఫీసర్ శ్రీనివాస్ సహకరించారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు

ఖమ్మంక్రైం,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌పై పద్మనాయక వెలమ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెలమ కులస్తుల అంతు చూస్తానంటూ అసభ్య పదజాలంతో ఎమ్మెల్యే మాట్లాడారని, ఒక ప్రజాప్రతినిధి తమ మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడారని పేర్కొన్నారు. తమ సామాజిక వర్గాన్ని కించపరుస్తూ దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు సాగి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సీతారాములు, సురేష్‌బాబు, సురేందర్‌రావు, ప్రభాకర్‌రావు ఉన్నారు.

హోంగార్డుల పని తీరు ప్రశంసనీయం

- పోలీస్‌శాఖలో.. వారి సేవలు వెలకట్టలేనివి
- భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో హోంగార్డు ఆఫీసర్స్ పని తీరు ప్రశంసనీయమని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. 62వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఐఎంఎ ఫంక్షన్ హాలులో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ రోహిత్‌రాజు హాజరయ్యారు. శాంతి కపోతాన్ని ఎగురవేశారు. జిల్లా పోలీసుశాఖలో ఒక భాగమై పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వర్తిస్తూ హోంగార్డు ఆఫీసర్స్ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. త్వరలో పదవి విరమణ పొందుతున్న 9మంది హోంగార్డ్స్ ఆఫీసర్స్‌కు బహుమతులను అందచేశారు. విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఆరుగురికి ప్రశంసాపత్రాలను అందచేశారు. కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయిమనోహర్, ఎఆర్ డీఎస్పీ సత్యనారాయణ, కొత్తగూడెం, పాల్వంచ డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, సతీష్‌కుమార్,ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సీఐలు సంజీవ్‌కుమార్, కరుణాకర్, రమేష్, శివప్రసాద్, సురేష్, టి.కరుణాకర్, ఇంద్రసేనరెడ్డి, ఆర్ఐలు హోమ్‌గార్డ్స్ ఇన్‌చార్జీ ఆర్ఐ నర్సింహారావు, అడ్మిన్‌ఆర్ఐ లాల్‌బాబు, సుధాకర్, కృష్ణారావు, ఆపరేషన్స్ ఆర్ఐ రవి పాల్గొన్నారు.

విజేతలకు ప్రశంసాపత్రాలు

గడిచిన అక్టోబర్ 21 పోలీస్ ప్లాగ్‌డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగానిలిచిన పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులకు ఎస్పీ రోహిత్‌రాజ్ తన కార్యాలయంలో ప్రశంసాపత్రాలను అందచేవారు. ఎస్ఐ ఆపైస్థాయి అధికారులకు ఇచ్చిన అంశంలో మొదటి బహుమతి అన్నపురెడ్డిపల్లి ఎస్ఐ చంద్రశేఖర్, రెండో బహుమతి షీ టీమ్ ఆర్ఎస్ఐ రమాదేవి, మూడో బహుమతి ఆర్ఎస్ఐ జగన్మోహనాచారి గెలుచుకున్నారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ విభాగంలో డీసీఆర్‌బీలో ఎఎస్ఐగా పని చేస్తున్న రఘురాములు మొదటి బహుమతిని, కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ రాందాస్ రెండో బహుమతిని, టేకులపల్లి కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఉపేందర్ రావు మూడో బహుమతిని గెలుసుకున్నారు.విద్యార్థుల విభాగంలో కొత్తగూడెం శ్రీప్రతిభ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థిని శ్రీకారుణ్య మొదటి బహుమతిని, పాల్వంచలోని శ్రీసాయిస్ఫూర్తి డీఏవీ స్కూల్‌లో 8వతరగతి చదువుతున్న యువతేశ్వరి రెండో బహుమతిని గెలుచుకున్నారు. అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగారాష్ట్రస్థాయిలో అన్నిజిల్లాల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో జిల్లా నుంచి విజేతలుగా నిలిచిన వారిని అభినందించారు.


కేక్‌కట్ చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్, పోలీసు అధికారులు

ఒకప్పుడు గొడవలు, కొట్లాటలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూ పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగే గ్రామాలవి.. నిత్యం పోలీస్ పికెట్‌లతో ఆ గ్రామాల ప్రజలు భయం భయంగా గడిపిన రోజులున్నాయి.. సాగుకు నీరు లేక, భూములకు ధరలు లేక, కూలీలకు చేసేందుకు పని లేక, రైతులకు వ్యవసాయం భారమై, కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో అర్థాకలితో అలమటించిన దుర్దినాలూ ఉన్నాయి. అలాంటి గ్రామాల్లో నేడు పరిస్థితి పూర్తి భిన్నంగా మారిపోయింది. జాతీయ రహదారులు, ఎత్తిపోతల పథకాలతో ఆ గ్రామాలు నేడు అభివృద్ధికి చిరునామాగా మారాయి. ఖమ్మం జిల్లా చింతకాని మండలం కొదుమూరు-వందనం గ్రామాల చుట్టూ ఐదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి ప్రజలు జీవన, ఆర్థిక పరిస్థితులను మార్చివేసింది. ప్రస్తుతం ఆయా గ్రామాల యువత రాజకీయాలు మానేసి ఉన్నత ఉద్యోగాలు పొంది జీవితంలో స్థిరపడేందుకు ఉత్సుకత చూపుతున్నారు...



అభివృద్ధికి 'వందనం'

- ఒకప్పుడు గొడవలతో రగిలిన గ్రామాల్లో నేడు అభివృద్ధి వెలుగులు
- రెండు జాతీయ రహదారులతో మారిన రూపురేఖలు
- ఎత్తిపోతల పథకంతో రెండింతలైన వ్యవసాయ ఉత్పత్తులు
- సమీపంలోనే ఖమ్మం నూతన కలెక్టరేట్
- 'రియల్‌భూమ్'తో భూముల ధరలకు రెక్కలు
- అభివృద్ధికి అడ్డాగా కొదుమూరు-వందనం గ్రామాలు



చింతకాని, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొదుమూరు, వందనం గ్రామాల్లో అభివృద్ధి వేగంగా విస్తరిస్తోంది. ఈ రెండు గ్రామాలు ఖమ్మం నగర కార్పొరేషన్‌కు దగ్గరగా ఉండటం, ఆ గ్రామాల గుండా సూర్యాపేట-దేవరపల్లి (గ్రీన్‌ఫీల్డ్), నాగ్‌పూర్-అమరావతి రెండుజాతీయ రహదారుల నిర్మాణం జరుగుతుండడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి.ఐదేళ్ల క్రితం అక్కడ లక్షల్లో ఉన్న భూముల ధరలు నేడు రూ.కోట్లలో పలుకుతున్నాయి.

రెండింతలైన వ్యవసాయోత్పత్తులు

2012కు ముందు వందనం-కొదుమూరు గ్రామాల్లో యాసంగిలో వ్యవసాయ భూములన్నీ నీరు లేక బీళ్లుగా ఉండేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న మల్లు భట్టి విక్రమార్క కృషితో కొదుమూరు-వందనం ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేసి సంవత్సరంలోనే పనులు పూర్తి చేసి నీటి విడుదల చేయడంతో ఆ ప్రాంతం సస్యశ్యామలమైంది. అప్పటి వరకు నామమాత్రంగా ఉన్న వ్యవసాయోత్పత్తులు భారీగా పెరిగాయి.

సమీపంలోనే నూతన కలెక్టరేట్

వందనం గ్రామ సమీపంలో నూతన కలెక్టరేట్ నిర్మాణంతో పాటు, ఖమ్మం నగరానికి చెందిన ఓ ప్రముఖ వస్త్ర వ్యాపారి కొనుగోలు చేసిన భూమిలో ఏర్పాటు చేసిన ఫొటో వ్యాలీతో ఆ గ్రామ అభివృద్ధికి మరింత ఊతమిచ్చింది. కలెక్టరేట్ నిర్మాణం అనంతరం అనేక పేరొందిన రియల్‌ఎస్టేట్ సంస్థలుఆ గ్రామంలో వెంచర్లు ప్రారంభించాయి. రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో మరింత అభివృద్ధి జరుగుతుందనే ఆలోచనలతో అనేక మంది ఇళ్ల స్థలాలు కొనేందుకు, పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గుచూపుతున్నారు. పురాతన రామలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న ఫోటోవ్యాలీ ఫోటో, వీడియో షూట్ ప్రేమికులను విపరీతంగా ఆకర్షిస్తోంది. ఫోటో, వీడియో షూట్‌లు, పుట్టిన రోజు, ఇతర వేడుకలకు ఫోటోలు తీసుకోవాలనే ఔత్సాహికులతో ఫోటోవ్యాలీలో నిత్యం సందడి నెలకొంటుంది.

యువత ఆలోచనలో మార్పు వచ్చింది



కొలిపల్లి శ్రీను, బీజేపీ నాయకుడు

గ్రామంలో ఇప్పుడున్న యువత ఆలోచన ధోరణి పూర్తిగా మారిపోయింది. రాజకీయాలు, రాజకీయ గొడవలపై కన్నెత్తి కూడా చూడటం లేదు. బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆలోచిస్తున్నారు. గ్రామంలో ఒకప్పటి పరిస్థితికి నేటి పరిస్థితికి చాలా తేడా కనిపిస్తోంది.

ఎకరం రూ.3కోట్లు



ఆవుల నాగేశ్వరరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు

వందనం, కొదుమూరు గ్రామాల్లో ప్రాంతాన్ని బట్టి ఎకరం కోటినుంచి మూడు కోట్ల వరకు పలుకుతోంది. గ్రామాల చుట్టూ రియల్‌ఎస్టేట్ వ్యాపారం, నూతన కలెక్టరేట్, జాతీయ రహదారుల నిర్మాణంతో భూముల ధరలు అమాంతం పెరిగాయి. ఇక్కడున్న ప్రజల జీవనశైలి పూర్తిగా మారిపోయింది.

వ్యవసాయరంగంలో మార్పులు



పెంటేల అప్పారావు, మొక్కజొన్న రైతు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కృషితో కొదుమూరు-వందనం ఎత్తిపోతల పథకం సాధ్యమైంది. ఒకప్పుడు ఒక్క పంట పండే భూముల్లో నేడు రెండు పంటలు పండుతున్నాయి. వేల ఎకరాల్లో భూమి సాగులోకి వచ్చింది. రెండు పంటలతో రైతులు వ్యవసాయంలో బీజీగా ఉన్నారు.


కొనసాగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులు


వందనంలో ఫోటో వ్యాలీ


రియల్ ఎస్టేట్ వెంచర్లు

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్య

జూలూరుపాడు/బోనకల్/ఆళ్లపల్లి డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భార్య చనిపోవడంతో ఒంటరి జీవితాన్ని గడపలేక మనస్థాపానికి గురై వృద్ధుడు పురుగులమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రులో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని గురవాగు తండా గ్రామానికి చెందిన బోడా భద్రు (62), భార్య కాంతి రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె చనిపోయిన దగ్గర నుంచి భద్రు ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. భార్య చనిపోవడంతో ఒంటరి జీవితాన్ని గడపలేనని, తాను కూడా చనిపోతానని పలుమార్లు తన ఇద్దరు కుమారులకు చెప్పాడు. కాగా వారు తాము చూసుకుంటామ ని చెప్పారు. ఈ క్రమంలో గురువారం సా యంత్రం భద్రు పురుగుమందు సేవించి కాకర్ల గ్రామ సమీపంలోని రహదారి పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గ్రామస్తుడు సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు చికిత్స కోసం ఆయన్ను కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు కుమారుడు నరసింహారా వు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిద ర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

అప్పుల బాద తాళలేక ఆటో డ్రైవర్ ఆత్మ

బోనకల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బోనకల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మరీదు అంజయ్య (55) అప్పుల బాద తాళలేక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆళ్లపాడు నుంచి బతుకు దెరువు కోసం గత కొన్ని సంవత్సరాల క్రితం బోనకల్‌కు వచ్చి ఇక్కడే స్థిరపడ్డాడు. కుటుంబ పోషణ భారంగా మారి అప్పుల పాలయ్యాడు. ఇంటిని తనఖా పెట్టి ప్రైవేటు ఫైనాన్స్ బ్యాంకులో రుణం తీసుకున్నాడు. దీనికి తోడు కొంత బంగారం బ్యాంకులో పెట్టి రుణం తీసుకున్నాడు. వడ్డీలు కడుతూ కొంత కాలం నెట్టుకొచ్చాడు. కాని రుణాల బారం పెరిగి అప్పులు కట్టే పరిస్థితి లేక మనోవేదనకు గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది. గురువారం సాయంత్రం గడ్డి మందు తాగాడు. 108 వాహనం ద్వార ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

ఉరివేసుకుని యువకుడి బలవన్మరణం

ఆళ్లపల్లి, డిసెంబరు 6 (ఆంధజ్యోతి) ఉరివేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన శుక్రవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో జరిగింది. ఆళ్లపల్లి మండల కేంద్రంలోని డబుల్‌బెడ్ రూం ప్రాంతానికి చెందిన చింత నర్సింహరావు, లక్ష్మి దంపతుల కుమారుడు చింత మహేష్(21). గురువారం రాత్రి నుంచి మహేష్ ఇంటికి రాలేదు. ఈ నేపథ్యంలో మహేష్ శుక్రవారం ఉదయం గుట్టబోడులో ఇప్పచెట్టుకు ఉరివేసుకుని మృతి చెందినట్టు స్థానికులకు కనిపించాడు. ఆళ్లపల్లి ఎస్ఐ రతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

రూ.24.50 లక్షల గంజాయి పట్టివేత

దుమ్ముగూడెం డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ, ఒరిస్సా సరిహద్దు ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ.24.50 లక్షల విలువ గల 97.62 కేజీల గంజాయిను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం ధర్మారం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ బానోత్ కిరణ్‌కుమార్, ఒరిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా బెజంగివాడకు చెందిన ఖగపతి ధకడ్‌లు ఏపీ, ఒడిస్సా సరిహద్దు నుంచి గంజాయిను అక్రమంగా కొనుగోలు చేసి తెలంగాణా ప్రాంతంలో విక్రయించేందుకు కారులో వెళ్తున్నారు. పోలీసుల వాహన తనిఖీల్లో పెదార్లగూడెం వద్ద పట్టుబడ్డారు. నిందితులు ఇద్దర్ని అరెస్ట్ చేయడంతో పాటు రెండు సెల్‌ఫోన్లను, కారును స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణాకు విఘాతం కలిగేలా నిషేదిత మాదకద్రవ్యాలు విక్రయించినా, సరఫరా చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

బస్సులో బంగారు నగల అపహరణ

మధిరటౌన్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణం వైరా రోడ్డుకు చెందిన పసుమర్తి విజయలక్ష్మికి చెందిన బంగారం శనివారం వైరా నుంచి మధిర వచ్చే బస్సులో అపహరణకు గురైందని విజయలక్ష్మి భర్త శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 5న విజయలక్ష్మి సత్తుపల్లిలోని తన ఆడబిడ్డ ఇంట్లో శుభకారార్యానికి వెళ్లారు. కొత్తగూడం పోస్టఆఫీస్‌లో పనిచేస్తున్న విజయలక్ష్మి కుమార్తె నిర్మల కూడా ఫంక్షన్‌కి సత్తుపల్లి వచ్చింది. పంక్షన్ పూర్తి అయ్యాక కూతురు తన బంగారం కూడ మధిర తీసుకుపొమ్మని తల్లికి ఇచ్చింది. విజయలక్ష్మి తన బంగారంతో పాటు తన కూతురు బంగారం అయిన ఒక వడ్డాణం రెండు హారాలు ఒక నక్లెస్ సుమారు 300 గ్రాముల బంగారం తీసుకొని బ్యాగ్ లో పెట్టుకొని సత్తుపల్లి లో బస్సు ఎక్కి వైరాలో దిగింది. మధిర వచ్చేందుకు వైరాలో బస్సు ఎక్కగా ఇద్దరు మహిళలు విజయలక్ష్మీతో మాటలు కలిపి సీటు ఇచ్చారని మధిరలో వైఎస్ఆర్ సర్కిల్ లో తనతో పాటు దిగారని తెలిపింది. ఇంటికి వచ్చిన వెంటనే విజయలక్ష్మీ తన బ్యాగు చూసుకోగా బ్యాగులో బంగారం బాక్స్ మాయమైందని గ్రహించి వెంటనే టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బస్సు దిగిన ప్రాంతం తో పాటు వివిద సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనుబల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఓ వ్యక్తి చికిత్స పొందుతూ ఖమ్మం ఆసుపత్రిలో శుక్రవారం మృతిచెందాడు. మండలంలోని కుప్పెనకుంట్ల గ్రామానికి చెందిన బైర్ల బాలాజీ(62) ఈనెల మూడున సాయంత్రం తన ద్విచక్రవాహనంపై వీఎంబంజర్ వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో బయ్యన్నగూడెంలో రోడ్డు ప్రమాదానికి గురైయ్యాడు. అనత్ని పెనుబల్లికి అక్కడి నుంచి ఖమ్మం ఆసుపత్రికి తరలిచంచారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడని బాలాజీ కుమారుడు వెంకటనర్సయ్య ఫిర్యాదు మేరకు పోలీసులకు దర్యాప్తు చేస్తున్నారు.

108 ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- నగదు విషయంలో మధ్య వర్తిగా ఉండటమే కారణం
- ఫిర్యాదు చేసిన బాధితుడి అక్క

కరకగూడెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగదు విషయంలో మధ్య వర్తిత్వంగా ఉన్నందుకు ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ప్రస్తుతం ఖమ్మంలోని ఓ ప్రయివేటు ఆసుప త్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిరుమళ్ల గ్రామానికి చెందిన దోమల ప్రణయ్ అనే వ్యక్తి కరకగూడెం మండలంలోని 108 వాహనం ఈఎంటీ గా పనిచేస్తున్నాడు. పినపాక మండలానికి చెందిన 108 వాహన ఉద్యోగి సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఇతరులుకు వడ్డీకి నగదు ఇస్తుంటాడు. సుబ్బారెడ్డి ప్రణయ్ పరిచయంతో కరకగూడెం గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులకు వడ్డీకి నగదు ఇప్పించాడు. అయితే వడ్డీకి తీసుకున్న వ్యక్తులు నగదు చెల్లించడంలో నిర్లక్ష్యం చేయడంతో సుబ్బారెడ్డి మధ్యవర్తిగా ఉన్న ప్రయణ్‌కు సంబంధించిన ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లాడు. దీంతో అవమానంగా భావించిన ప్రయణ్ అయ్యప్ప దీక్షలో ఉండి నవంబరు 30న పురుగుల మందు సేవించాడు. ఈ విషయం ఇంటి వద్ద ఎవరికి చెప్పకుండా రెండోరోజు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించుకుని డిసెంబరు 2న అయ్యప్ప ఇరుముడి కట్టుకుని శబరిమల వెళ్లాడు. అక్కడ ప్రణయ్ ఆరోగ్యం సహకరిం చకపోవ డంతో స్థానికంగా చికిత్స చేపించారు. అయితే పురుగుల మందు తాగిని విషయాన్ని తోటి అయ్యప్ప భక్తులకు కూడ తెలపలేదు. అయ్యప్ప దర్శనం అనంతరం తిరుగుప్రయా ణమై 6వ తేదిన విజయవాడకు వచ్చే వరకు ప్రణయ్ పరిస్థితి విషమంగా మారడంతో బంధువులు అక్కడనుంచి కారులో తీసుకవచ్చి ఖమ్మంలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చేర్పించారు. అక్కడ జరిగిన విషయాన్ని వారికి వివరించారు. ప్రస్తుతం ప్ర యణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమా చా రం. శుక్రవారం ప్రణయ్ అక్క వీరగాని న వ్య శ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్

- రాగి,జొన్న బిస్కెట్లను తయారు చేస్తున్న గిరిజన మహిళలు
- విక్రయానికి వివిధ ప్రాంతాలలో అందుబాటులో స్టాల్స్


బిస్కెట్లను తయారు చేస్తున్న దృశ్యం



విక్రయానికి సిద్ధంగా ఉన్న రాగి, జొన్న బిస్కెట్లు

భద్రాచలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీరామ జాయింట్ లయబిలిటీ గ్రూప్ ఆధ్వర్యంలో మహిళలు రాగి, జొన్న బిస్కెట్లను తయారు చేస్తున్నారు. గిరిజన మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా బలపడేందుకు ఐటీడీఏ సహకారం అందిస్తోంది. ఇందులో భాగంగా రాగి, జొన్న బిస్కెట్ల తయారీకి అవసరమైన శిక్షణ, యంత్ర పరికరాలు అందించటంలో ఐటీడీఏ పాత్ర ఉంది. గతంలో శానిటరీ నాప్కిన్ యూనిట్ ఏర్పాటు సమయంలో కేటాయించిన దాంట్లో మిగిలిన మొత్తంతో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేయటం జరిగింది. రోజుకు 5 కేజీల బిస్కెట్లను తయారు చేయటం జరుగుతోంది. వీటిని ప్రస్తుతం భద్రాచలం, కొత్తగూడెంలలో విక్రయాలకు అందుబాటులో ఉంచగా త్వరలో ఖమ్మంలో సైతం విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నారు.

గిరి శానిటరీ ప్యాడ్స్‌కు డిమాండ్

భద్రాద్రి శ్రీరామ శానిటరీ నాప్‌కిన్ యూనిట్ ఆధ్వర్యంలో గిరిజన మహిళలు తయారు చేస్తున్న గిరి శానిటరీ ప్యాడ్స్‌కు ఇటీవల డిమాండ్ పెరుగుతుంది. రూ.13.45 లక్షల ప్రాజెక్టు విలువలో బ్యాంకు రుణం రూ.4,03,500, ప్రభుత్వ సబ్సిడీ రూ.8,07,000, గ్రూప్ కాంట్రిబ్యూషన్ రూ.1,34,500 తో సుమారు ఏడేళ్ల క్రితం ఈ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. రాజస్థాన్ నుంచి వచ్చిన నిపుణులు శానిటరీ ప్యాడ్స్ తయారీలో శిక్షణ ఇవ్వగా మూడు నెలలకు 40 వేల ప్యాడ్‌లను తయారుచేస్తున్నారు. వీటిని గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో గిరిజన వసతి గృహాలకు సరఫరా చేస్తున్నారు. ఒక ప్యాకెట్ విలువ రూ.28గా నిర్ణయించారు. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని వసతి గృహాలకు సరఫరా చేయటంతో వచ్చిన స్పందనతో ములుగు, ఏటూరునాగారం, నల్గొండలకు సైతం గిరి శానిటరీ ప్యాడ్లను పంపినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. అయితే ఒక నెలలో 40 వేల ప్యాడ్‌లు తయారు చేస్తే అవి మార్కెట్ అవ్వటానికి మూడు నెలల సమయం పడుతుండటంతో వారు రెండు నెలలు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. దీంతో ఐటీడీఏ పీవోగా గతంలో పని చేసిన ప్రతీక్‌జైన్ ఏదైనా మరో వ్యాపారం చేయాలని సూచించటంతో వారు భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్ పేరుతో రాగి, జొన్న బిస్కెట్ల తయారీకి ఆసక్తి చూపారు.

ఫలించిన ప్రయత్నం

రాగి, జొన్న బిస్కెట్ల తయారీ శిక్షణ కోసం మహిళలు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు వెళ్లి శిక్షణ పొందారు. ఈ క్రమంలో నేర్చుకున్న వారు స్వయంగా రాగి, జొన్న బిస్కెట్ల తయారీ చేపట్టిన ప్రయత్నం ఫలించిందని వారు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో బిస్కెట్ల తయారీ ప్రక్రియను మరింత పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. రాగిపిండి, బెల్లం, బటర్, నెయ్యి లతో రాగిబిస్కెట్లను తయారు చేస్తున్నారు. అలాగే జొన్న పిండి, బెల్లం, బటర్, నెయ్యిలతో జొన్న బిస్కెట్లను తయారు చేస్తున్నారు. చిన్న ఓవెన్ ద్వారా బిస్కెట్ల తయారీని గిరిజన మహిళలు చేపడుతున్నారు. ఒక కేజీకి 8 డబ్బాలు తయారు అవుతుండగా ఒక డబ్బాలో 20 బిస్కెట్లు ఉంటాయి. ఈ క్రమంలో రోజుకు 40 డబ్బాల బిస్కెట్లను సిద్ధం చేస్తున్నారు. వారు ఊహించినట్లుగానే రాగి, జొన్న బిస్కెట్లకు డిమాండ్ ఉండటంతో పెద్ద ఓవెన్‌ను కొనుగోలు చేసేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు. దీని ద్వారా ఒక విడతకు 600 బిస్కెట్లు తయారయ్యే అవకాశం ఉంటుందని దీంతో అందరికీ అందించేందుకు అవకాశం ఉంటుందని వారు అభి ప్రాయపడుతున్నారు.

మా బిస్కెట్లు లండన్ కూడా వెళ్లాయి



ఊకె వెంకట లక్ష్మి, టీం లీడర్ 1

మేము తయారు చేసిన రాగి, జొన్న బిస్కెట్లను భద్రాచలానికి చెం దిన వారు లండన్‌కు పం పారు. అక్కడ వాటిని తిన్న వినియోగదారులు మమ్మల్ని సంప్రదించి మళ్లీ కావాలని అడిగారు.అది మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. భద్రాచలం పరిసర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు సైతం తమకు బిస్కెట్లు పంపాలని కోరుతున్నారు. ఇంకా మార్కెట్‌ను పెంచుకోవాల్సిన అవసరం ఉంది. మేమంతా ఐక్యంగా వ్యాపారం చేసుకుని అభివృద్ధి చెందాలని భావిస్తున్నాం.

మిల్లెట్ మ్యాజిక్‌కు ఆదరణ లభిస్తోంది



తాటి లలిత , టీం లీడర్ 2

భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్‌కు వినియోగదారుల నుంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం భద్రాచలంలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో, కొత్తగూడెం కలెక్టరేట్‌లో రాగి, జొన్న బిస్కెట్లను వి క్రయిస్తున్నాం. త్వరలో ఖమ్మం కలెక్టరేట్, భద్రాద్రి రామాలయ ప్రాంగణంలో సైతం విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నాం.





సీసీ రోడ్లకు శంకుస్థాపన

నేలకొండపల్లి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూటాపురంలో రూ.25 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లకు శుక్రవారం ఏఎంసీ చైర్మన్ సీతారాములు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుడిమళ్ల మధు, బొల్లినేని వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు కట్టా రాజేష్, నంబూరి హరీష్‌తో పాటు తెలంగాణా ఉద్యమకారుడు చావా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	40 రూ.
వంకాయ	24
గుత్తి వంకాయ	38
బీరకాయ	54
పచ్చిమిర్చి	28
కాకరకాయ	28
బెండకాయ	20
పొట్లకాయ	38
దోసకాయ	28-44
చిక్కుడు	58
నాటుచిక్కుడు	68
గోరుచిక్కుడు	28
క్యాబేజీ	24
దొండ	30-38
సొరకాయ	20
క్యారెట్	48
క్యాప్సికం	54
ఆలుగడ్డ	38
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	195
కొత్తిమీర కట్ట	40

\- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మెకానిక్‌రాకీ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	పుష్ప 2



ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న నేతలు

ఫిబ్రవరిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

- రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మూర్తి, నాగరాజు
- ఖమ్మంలో ఘనంగా నిర్వహణ
- లోగో ఆవిష్కరించిన నేతలు

ఖమ్మంటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర మహాసభలను వచ్చేఏడాది ఫిబ్రవరి 20,21,22 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్నారు. ఈ వివరాలు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్.మూర్తి, టీ.నాగరాజు తెలిపారు. శుక్రవారం నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మహాసభల ఆహ్వానసంఘం అధ్వర్యంలో మహాసభల లోగోను జిల్లా కార్యదర్శి టీ. ప్రవీణ్ అధ్యక్షతన ఆహ్వానసంఘం అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు ఆహ్వానసంఘం కమిటీతో కలిసి ప్రారంభించారు. అధ్యయనం- పోరాటం అనే నినాదంతో 1970నుంచి విద్యావ్యతిరేక విధానాలపై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈమహాసభల స్ఫూర్తితో తెలంగాణాలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆహ్వానసంఘం వైస్‌చైర్మన్లు ఐవీ.రమణ, ఎం, వీరారెడ్డి, కాంతారావు, గౌరవ సలహాదారులు ఎం. సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్రసహాయ కార్యదర్శి కిరణ్ జిల్లా ఉపాధ్యక్షుడు పాల్గొన్నారు.

గరికపాటి సోదరులను పరామర్శించిన ఎంపీ వద్దిరాజు

ఖమ్మంరూరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బారుగూడెంలోని శ్రీ సిటీ చైర్మన్ గరికపాటి వెంకట్రావు, ఆంజనేయప్రసాద్‌ల తండ్రి రాఘవయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. రాఘవయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పలువురు ప్రముఖులు వారి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శీలంశెట్టి వీరభద్రం, బీఆర్ఎస్ నాయకులు జీవన్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వర్ధంతి



మాలమహానాడు, అంబేద్కర్ ప్రజాసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళి, ఇన్‌లా ఫోరం కార్యాలయంలో..

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని వివిధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాలమహానాడు ఆధ్వర్యంలో ఆసంఘం నాయకులు గుంతేటి వీరభద్రం ఆధ్వర్యంలో నగరంలోని జడ్పీసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రాజ్యాంగ హక్కుల రక్షణతో సమాజాన్ని కాపాడిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఈకార్యక్రమంలో కొరివి దయానంద్, వరద నరసింహరావు, కొట్టే సుధాకర్, గుమ్మడి కనకరాజు తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ ప్రజాసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆసంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కత్తి నెహ్రూగౌడ్, దామల్ల వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాస్, తలారి రాధాకృష్ణ, ఎర్ర గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. సేవాలాల్ సేన ఆధ్వర్యంలో కూడా వర్ధంతి నిర్వహించారు.

బీజేపీ శ్రేణుల బైక్ ర్యాలీ

కూసుమంచి:కూసుమంచి మండలకేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీని పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నున్నా రవికుమార్ ప్రారంభించారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు తక్కెళ్ల నరేంద్రరావు, గుండా శ్రీనివాసరెడ్డి, సంతోష్‌రెడ్డి, గుండా ఉపేందర్‌రెడ్డి, హట్యానాయక్, గడ్డంవెంకటేశ్వర్లు, బాణోత్ రవిరాథోడ్, సుదర్శన్ పాల్గొన్నారు.



కూసుమంచిలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తిరుమలాయపాలెం:మండలంలో సుబ్లేడు, తిరుమలాయపాలెకం,పిండిప్రోలు,కొక్కిరేణి, మహ్మదాపురం,కాకరవాయి, బచ్చోడు గ్రామాల్లో వర్ధంతి నిర్వహించారు. ఈకార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ము శ్రీను, బొబ్బిలిభరత్‌చంద్ర, పగిడిపల్లి బాబు, నేర్సుల వెంకటేష్, వెంకటేశ్వర్లు, రాము,రామకృష్ణశ్రీను పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండలవ్యాప్తంగా వివిధ పార్టీలు,సంఘాలు నిర్వహించాయి. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ మూటాపురంలో అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తక్కెళ్ళపల్లి నరేంద్రరావు, మల్లారెడ్డి, మహేందర్‌తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సీతారాములు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగేశ్వరి, డైరెక్టర్ చిట్టూరి అచ్చయ్య, మోర మల్లయ్య, కైలాసపు వెంకటేశ్వర్లు, ఐతనబోయిన శ్రీను పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలి

ఖమ్మంరూరల్: అంబేద్కర్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటి సభ్యుడు పి.సత్యనారాయణ అన్నారు. అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా మండలంలోని వెంకటాయపాలెం, చింతపల్లి, జలగం నగర్, పోలేపల్లి, పెద్దతండా తదితర గ్రామాల్లో శుక్రవారం వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందిగామ కృష్ణ, యాదగిరి, వరకుమార్, బాలరాజు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

రూ.8.68 లక్షల సొత్తు స్వాధీనం

మధిరటౌన్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మధిర టౌన్ పోలీసులు ఓ అంతర్రాష్ట్ర దొంగను పట్టుకుని, రూ.8.68 లక్షల విలువ గల సొత్తును రికవరీ చేసినట్లు వైరా ఏసీపీ రెహమాన్ తెలిపారు. శనివారం మధిర సీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మధిర టౌన్ ఎస్ఐ సంధ్య అదనపు ఎస్ఐ చంద్రశేఖర్ ఉదయం 10గంటల ప్రాంతంలో ఆత్కూరు సర్కిల్‌లో వాహన తనిఖీలు చేస్తున్నారు. కారులో ఉన్న ఓ వ్యక్తి అనుమానస్పదంగా వ్యవహరించడంతో తనిఖీ చేశారు. అతని వద్ద ఖమ్మంలో అమ్మేందుకు తీసుకవెళుతున్న బంగారం లభించింది. అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. అతడు కారు కిరాయికి తిప్పే మడుపల్లికి చెందిన బండి గోపిగా తెలిపాడు. ఇటీవల మధిరతో పాటు మండలంలో జరిగిన పలు వరుస చోరీలకు పాల్పడినట్లు తెలిపాడు. ఇటీవల ఆత్కూరులో చోరీ చేసిన లక్షన్నర నగదు, మడుపల్లిలో చోరీ చేసిన రెండు లక్షల బంగారు నగలు, ముప్పయి వేల నగదు, మధిరటౌన్‌లోని ఏడు దొంగతనాల తో పాటు ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం, వత్సవాయిలో దొంగతనంతో కలిపి మొత్తం తొమ్మిది దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు.

నకిలీ విలేకరి అరెస్టు

తిరుమలాయపాలెం,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముజామిద్‌పురానికి చెందిన పుల్లూరు ప్రభాకర్ అనే విలేకరిని శుక్రవారం తిరుమలాయపాలెం పోలీసులు అరెస్టు చేశారు. ఓ ఆన్‌లైన్ పేపర్ పెట్టుకుని విలేకరిగా చెప్పుకుంటున్నాడు. పోలీసు అధికారులు, అందరు నాకు తెలుసని ట్రాక్టర్ల వారిని బెదిరిస్తూ అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తూ దొరికాడు. ఈమేరకు కేసు నమోదుచేశారు. ఈసందర్భంగా ఎస్ఐ జగదీష్ మాట్లాడుతూ మండలంలో కొందరు విలేకరులుగా చెప్పుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని,ప్రజలను వ్యాపారుల, ఉద్యోగులను ఇబ్బందిలు పెడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విలేకరుల పేరుతో వేధిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

కూసుమంచి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కూసుమంచి ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్యశాఖాధికారి కళావతిబాయి తనిఖీ చేశారు. ఇటీవల పీహెచ్‌సీలో సిబ్బంది ఒకరికొకరు కుమ్ములాడుకుంటున్నారు. ఈక్రమంలో ఆమె దృష్టికి వెళ్లడంతో పీహెచ్‌సీని సందర్శించిన ఆమె సిబ్బందిని కూర్చోబెట్టి మందలించారు. ఒకరికొకరు సమన్వయంతో పనిచేసుకోవాలని ఆదేశించారు. లేనిపక్షంలో ఎవరైనా సరే ఉపేక్షించకుండా క్రమశిక్షణాచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు సేవలందించాలని తెలిపారు. కార్యక్రమంలో మండలవైద్యాధికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెట్స్‌కు కలెక్టర్ అభినందన

ఖమ్మంస్పోర్ట్స్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఈనెల7 నుంచి11 వరకు భువనేశ్వర్‌లో జరగనున్న 39వ జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరుపున పాల్గొననున్న జిల్లా క్రీడాకారులను శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అభినందించారు. వరంగల్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గోపీచంద్, మస్తాన్, అశోక్, మబీన్, వైశాలి, మనుశ్రీ, క్రిష్ణవేణి సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, వాలీబాల్ కోచ్ అక్బర్ అలీ, ఉన్నారు.

లారీ పట్టివేత

ఖమ్మంక్రైం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా గుట్టమట్టిని తరలిస్తున్న లారీను శుక్రవారం రాత్రి ఖానాపురం హవేలీ పోలీసులు పట్టుకున్నారు. బాలపేట తండాకు చెందిన లారీయజమాని అజ్మీర శ్రీను లారీలో అనుమతి లేకుండా బాలపేట గుట్ట నుంచి మట్టిని తరలిస్తున్నాడు. పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ఖానాపురం హవేలీ పోలీసులు తనిఖీ నిర్వహించి లారీను స్టేషన్‌కు తరలించారు. తరువాత లారీయజమాని శ్రీను, డ్రైవర్ నరసింహారావులపై కేసు నమోదు చేశారు.

15న నెలనెల వెన్నెల

ఖమ్మంసాంస్కృతికం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రతినెలా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమం నెలనెల వెన్నెల ఈనెల 15న సాయంత్రం నిర్వహిస్తామని కార్యక్రమ నిర్వాహకులు ఎఎస్ కుమార్, మోటమర్రి జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిశి నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు.

యూటీఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఆరో మహా సభలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం నగరంలోని సంఘం కార్యాలయంలో విద్యా మహాసభల పోస్టర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ నెల 14,15 తేదీల్లో సత్తుపల్లిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో జాగటి యాకయ్య, నాస్త్రవ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పగిడిపల్లికి కేంద్ర ప్రభుత్వ ఆహ్వానం

ఖమ్మంటౌన్,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఖమ్మానికి చెందిన తెలంగాణా కళాపరిషత్ అధ్యక్షుడు పగిడిపల్లి రాజారావుకు అరుదైన గౌరవం దక్కింది. ఈనెల 9న ఢిల్లీలోని అజయ్ అక్షయ అర్జభవన్‌లో కేంద్రమంత్రి మురళీధర్‌తో జరిగే సమావేశానికి ఆహ్వానం అందింది. కేంద్రమంత్రి కార్యాలయం నుంచి ఆయనకు సమాచారం అందిందని రాజారావు తెలిపారు.

జాతీయ రహదారిపై కారు పల్టీ



కూసుమంచి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై కారు పల్టీకొట్టింది. ఈప్రమాదంలో కారు బెలూన్స్ ఓపెన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి ప్రమాదం తప్పింది. ఖమ్మం నగరానికి చెందిన స్వరూప్ బంధువుతో కలిసి శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఖమ్మం వస్తున్నారు. ఈక్రమంలో కూసుమంచి మండలం గోపాలరావుపేట సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి బోల్తాపడింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

అవినీతి నిరోధక వారోత్సవాలు



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

ఖమ్మంలీగల్,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధ కశాఖ, ఖమ్మం రేంజ్ ఆధ్వర్యంలో శుక్రవారం అవినీతి నిరోధక వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులతో జిల్లా కోర్టు కాంప్లెక్స్ నుంచి ఇల్లందు క్రాస్‌రోడ్డు వరకు ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన న్యాయాధికారి టి.రాజగోపాల్ హాజరయ్యారు. జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అవినీతి ప్రభావం గురించి, అవినీతి దుష్ఫలితాలు, అన్ని స్థాయిలలో దానిని ఎదుర్కోవడం వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రేంజ్ ఏసీబీ డీఎస్పీ వై.రమేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భవాని మాత వార్షికోత్సవం

తిరుమలాయపాలెం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్లేడు, మేడిదపల్లి గ్రామాల మధ్య ఉన్న భవాని మాత అమ్మవారు వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాలనుంచి మహిళలు పెద్దత్తున తరలివచ్చారు. మహిళలు బోనాలు ఎత్తుకుని భవాని మాతకు మొక్కుల సమర్పించారు. కొలాట, డప్పునృత్యాలు అలరించాయి. జిల్లా కాగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఓర వెంకటేశ్వర్లు, సుమన్‌రెడ్డి, వెంకటనారాయణ, రాంబాబు, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



భవాని అమ్మవారికి పూజలు చేస్తున్న నరేష్‌రెడ్డి

ఘనంగా అయ్యప్ప పడిపూజ

ఖమ్మంసాంస్కృతికం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): స్వామియే శరణం అయ్యప్ప శరణు ఘోషతో ముస్తఫా నగర్ ప్రాంతం మార్మోగింది.. శుక్రవారం సాయంత్రం శ్రీదివ్యమణికంఠ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో మహాపడి పూజ నిర్వహించారు. పాక థిల్లాన్ నారాయణ్ నంబూద్రి ఆధ్వర్యంలో జరిగిన పడిపూజకు అయ్యప్ప భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ చిర్రారవి, ప్రధాన కార్యదర్శి పుట్ట మల్లికార్జున్, కృష్ణమూర్తి, నిదిగొండ శేఖర్, కూరపాటి రవితేజ, మాచర్ల నరేష, సామినేని రవి, చందా రాంబాబు, వీరభద్రం పాల్గొన్నారు.



ముస్తఫా నగర్‌లో అయ్యప్ప పడి పూజ దృశ్యం

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని శుక్రవారం ఆసుపత్రి వద్ద కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. మూడు నెలలుగా జీతాలు చెలిల్లించాలని కోరుతూ సీఐటీయూ, ఐఎఫ్‌టీయు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మూడు నెలలుగా జీతాలు అందకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మ విష్ణు వర్ధన్, జి రామయ్య, వై విక్రం, తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మాదక ద్రవ్యాలపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంరూరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ అన్నారు. ఖమ్మం రూరల్ సీఐ ముష్కరాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మండలంలో అర్ధరాత్రి వేళ నిర్మానుష్య ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని కోరారు. గ్రామాల్లో బెల్టు షాపుల్లో అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు నిర్వహించడం వలన అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు జక్కంపూడి కృష్ణ, మురళి, తోట నరేష్, భాస్కర్‌రావు, నాగేశ్వరరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



రూరల్ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

సాయితేజకు కన్నీటి వీడ్కోలు

- అమెరికా నుంచి ఉదయం ఖమ్మం చేరిన మృతదేహం
- నివాళులర్పించిన ప్రముఖులు.. రామన్నపేటలో అంత్యక్రియలు

ఖమ్మంటౌన్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి):అమెరికాలో గుర్తుతెలియని దుండగుల కాల్పుల్లో మృతిచెందిన నూకారపు సాయితేజ(22)కు కుటుంబసభ్యులు, బంధువులు శుక్రవారం కన్నీటి వీడ్కోలు పలికారు. గత నెల 30న సాయితేజ అమెరికాలోని ఒక మాల్‌లో దుండగుల కాల్పుల్లో మృతిచెందిన విషయం విదితమే. ఈ క్రమంలో ఆయన మృతదేహం శుక్రవారం ఖమ్మంలోని రాపర్తినగర్‌కు చేరింది. కొడుకు మృతదేహాన్ని చూసిన వెంటనే తల్లిదండ్రులు కోటేశ్వరరావు, వాణి దంపతులు గుండెలు పగిలేలా రోదించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీటి పర్యంతం అయ్యారు. అంత్యక్రియలు నగరంలోని రామన్నపేటలో శుక్రవారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. సాయితేజ మృతదేహాన్ని ఖమ్మం తీసుకురావడంలో తానా ప్రతినిధులు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఎంతో కృషి చేశారు. పోస్టుమార్టం అనంతరం గురువారం మృతదేహాన్ని అక్కడ ఉన్న మృతుని స్నేహితులు, బంధువులకు అధికారులు అప్పగించారు. దీంతో తానా సభ్యులు సాయితేజ మృతదేహాన్ని గురువారం మధ్యాహ్నం ఖతార్ ఎయిర్‌లైన్స్ విమానంలో పంపగా, అర్ధరాత్రి 2-30గంటలకు హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరింది. అక్కడి నుంచి వాహనం ద్వారా శుక్రవారం ఉదయం ఖమ్మంలోని రాపర్తినగర్‌లోని ఇంటికి చేరుకుంది. సంప్రదాయ కార్యక్రమాల అనంతరం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

స్నేహితుడి కోసం విధులకు వెళ్లి..

విధుల విషయంలో తన స్నేహితుడికి సాయం చేసేందుకు వెళ్లి సాయితేజ ప్రాణాలు కోల్పోవడాన్ని కుటుంబసభ్యులు, బంధువులు జీర్ణించుకోలేక పోతున్నారు. సాయితేజ పనిచేస్తున్న మాల్‌లోనే వేరే విభాగంలో అతడి స్నేహితుడు పనిచేస్తున్నాడు. అక్కడికి వెళ్లిన సాయితేజను స్నేహితుడు నమాజ్ ప్రార్థనకు వెళ్లి వస్తానని కొద్దిసేపు ఉండమని కోరాడు. దీంతో సాయితేజ అక్కడ ఉండగా, దుండగులు కాల్పులు జరపడంతో మృతిచెందాడు. ఈ విషయాన్ని గుర్తు చేసుకొని స్నేహితులు, బంధువులు, కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. కాగా, సాయితేజ మృతదేహానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మేయర్ పునుకొల్లు నీరజ, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్ పలువురు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.



సాయితేజ మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలింపు

మానసిక ఒత్తిడిని అధిగమిస్తే విజయాలను సాధించవచ్చు

బోనకల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడిని అధిగమించడం ద్వార విజయాలను సాధించవచ్చునని వైద్యాధికారి స్రవంతి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం 'మానసిక ఒత్తిడి-నివారణ చర్యల' పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో పెరిగే ఆత్మహత్యలను నివారించే విధంగా టెలిమనస్ కార్యక్రమాన్ని రూపొందించారని తెలిపారు. ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నెంబర్ 14416ను అందుబాటులోకి తెచ్చారని పేర్కొన్నారు. యోగా, పుస్తక పఠనం, స్నేహితులతో భావాలను పంచుకోవడం ద్వార ఒత్తిడిని అధిగమించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నళినిశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మికి త్వరలో తులం బంగారం: ఎమ్మెల్యే



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

తల్లాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల పెళ్లిళ్లు చేయడంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తల్లిదండ్రులను ఆదుకొనేందుకు అమలవుతున్న కల్యాణ లక్ష్మీ పథకం కింద రూ.1,00,116నగదుతోపాటు త్వరలో తులం బంగారం కూడా అందజేయటం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శుక్రవారం తల్లాడ రైతువేదికలో తల్లాడ మండలానికి చెందిన వందమంది లబ్ధిదారులకు రూ.1,00,11,600 చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎన్నికల వాగ్ధానం మేరకు తులం బంగారం అందజేయడంలో జాప్యం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సాంకేతిక సమస్యల వల్ల కొందరికి గ్యాస్ సబ్సిడీ జమకావడం లేదని ఆసమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో ఎం.చంద్రమౌళిని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏ.వనజ, ఐబీ డీఈ శ్రీనివాసరావు, ఎస్‌ఐ బి.కొండల్‌రావు, ఎంఆర్‌ఐలు భాస్కర్, ఖాజా మోహిద్దీన్, సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్ పాల్గొన్నారు.

అన్నారుగూడెం మాజీ సర్పంచ్ రాఘవులు కన్నుమూత



తల్లాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అన్నారుగూడెం మాజీ సర్పంచ్ పుచ్చకాయల రాఘవులు(95) అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందారు. రాఘవులుకు కుమార్తె ఉన్నారు. 2008నుంచి 2012వరకు రాఘవులు అన్నారుగూడెం సర్పంచ్‌గా పనిచేశారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో రాఘవులు కొరియర్‌గా పనిచేశారు. రాఘవులు మృతదేహాన్ని మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, దొడ్డా చిన్నశ్రీనివాసరావు, సీపీఎం మండల నాయకుడు పులి వెంకటనర్సయ్య కాంగ్రెస్ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), పొన్నం కృష్ణయ్య, గోవిందు శ్రీనివాసరావు, బొమ్మగాని రామనాథం, కోసూరి వెంకటేశ్వర్లు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

పూర్ణమ్మకు టీడీపీ నాయకుడు రామనాథం నివాళి

మధిర రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మాటూరుపేట గ్రామంలో శ్రీసీతారామాంజనేయ కళాపరిషత్ అధ్యక్షుడు గడ్డం సుబ్బారావు మాతృమూర్తి పూర్ణమ్మ(92) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఈమె భర్త సూర్యనారాయణ మాటూరుపేట సర్పంచ్‌గా కూడా పనిచేశారు. పూర్ణమ్మ మృతదేహాన్ని రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, సీపీఎం రాష్ట్ర కమిటీ నాయకుడు పోతినేని సుదర్శన్, టీడీపీ ఖమ్మం జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం,

టీడీపీ మండల అధ్యక్షుడు మార్నీడి పుల్లారావు, పలుపార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

కాంగ్రెస్ హామీలు అమలుచేయాల్సిందే..

కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



మధిరలో ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డి

మధిర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలుచేసేంతవరకు బీజేపీ వదిలిపెట్టదని కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మధిర పట్టణంలో ఆపార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఖబడ్దార్ అని కాంగ్రెస్ నాయకులు బెదిరిస్తే భయపడటానికి ఇక్కడ ఉన్నది బీజేపీ కార్యకర్తలని గుర్తుపెట్టుకోవాలన్నారు. పది సంవత్సరాలుగా కేసీఆర్ ప్రజావ్యతిరేక విధానాలను ఎదురించి అనేక పోరాటాలు చేసి అక్రమ కేసులు ఎదుర్కొన్నామని తెలిపారు. భట్టి విక్రమార్క హామీల విషయంలో చర్చించాలంటే ఏ అర్హత కావాలో కాంగ్రెస్ నాయకులు చెప్పాలన్నారు. హామీలు అమలుచేసేంతవరకు బీజేపీ విశ్రమించదని ప్రజలతో కలిసి పోరాడతామని తెలిపారు. ఈకార్యక్రమంలో మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు, జిల్లాకార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ అధ్యక్షులు పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహారావు, కుంచం కృష్ణారావు, మర్సకట్ల స్వర్ణాకర్, గడ్డం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వరుస చోరీలు

బోనకల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బోనకల్, చిరునోముల గ్రామాల్లో దొంగలు వరుస చోరీలకు పాల్పడ్డారు. తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకున్నారు. బోనకల్ గ్రామానికి చెందిన మల్లేల నాగేశ్వరరావు అమృతసర్‌లో మిలటరీ మెడికల్ కోడ్‌లో హవల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అక్కడే భార్య, పిల్లలతో కలిసి ఉంటున్నారు. సొంత గ్రామంలో ఇంటికి తాళం వేసి ఉండటాన్ని దొంగలు గమనించారు. తలుపును బద్దలు కొట్టి లోపల ఉన్న రూ. 30వేల విలువ చేసే టీవీ, 20 వేల విలువ చేసే వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. చిరునోములలో బోడేపుడి స్వరూపరాణి ఇంటికి తాళం వేసి ఖమ్మంలో ఆమె కుమారుడి ఇంటికి వెళ్లింది. రెక్కి నిర్వహించిన దొంగలు తాళాలు పగులకొట్టి ఇంట్లో దాచిన రూ. 75వేల నగదు, మరో 25 వేల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేశారు. ఇళ్ల తాళాలు పగులకొట్టడం చూసిన తురువాత బాధితులు, వారి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మధుబాబు కేసు నమోదు చేశారు. క్లూస్ టీం సభ్యులు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించి, ఆధారాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వైరా నియోజకవర్గ అభివృద్ధికి కృషి

పోడు భూముల్లో బోర్లు అనుమతి కోసం 6నెలలు శ్రమించా ●ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కొణిజర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతున్నానని, ఏడాది కాలంలో రూ.1000 కోట్లతో అభివృద్ధి చేశానని ఇంకా ఎంతో చేయాల్సి ఉందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బోడియాతండా, తుమ్మలపల్లి, సింగరాయపాలెం, సాలెబంజర, మేకాలకుంట, లక్ష్మీపురం, గుబ్బగుర్తి గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటించి సీసీరోడ్లు, డ్రైన్‌లకు శంకుస్థాపనలు చేశారు. సాలెబంజరలో పోడు భూముల్లో రైతులు వేసుకున్న బోర్లను ప్రారంభించారు. మాట్లాడుతూ వైరా కేంద్రంలో 100 పడకల ఆసుపత్రికి రూ. 26 కోట్లు, ఇంటిగ్రేటడ్ పాఠశాలకు రూ. 125 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. పోడు రైతుల పరిస్థితి తెలుసుకొని నియోజకవర్గంలో పోడుభూముల్లో 5వేల బోర్లు వేసుకునేందుకు 6నెలలు శ్రమించి అనుమతులు తెచ్చామన్నారు. బోర్లు, కరెంట్ కోసం అసెంబ్లీలో మాట్లాడానని, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్లతో కూడ మాట్లాడానన్నారు. ఈరోజు రైతులు వేసుకున్న బోర్లు ప్రారంభించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆనాడు బీఆర్‌ఎస్ అధికారంలో రైతులు జైళ్లకు వెళ్లారని ఆ బాధలు కాంగ్రెస్ ప్రభుత్వంలో రావని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డే నారాయణరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు సూరంపల్లి రామారావు, దర్శి చెన్నారావు, మాజీ ఎంపీపీ గోసు మధు, ఆత్మచైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, రాంపుడి రోశయ్య, రాయల పుల్లయ్య, పరికపల్లి శ్రీను, సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి రవి, ఏలూరు శ్రీనివాసరావు, అనుమోలు కృష్ణార్జునరావు, చింతనిప్పు నరసింహారావు, గడల నరేందర్, గుండ్ల కోటి, రంజిత్, తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్, ఎంపీడీవో రోజారాణి, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ కిషోర్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు నాయకులు పాల్గొన్నారు.



సింగరాయపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో శాతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్టు

» రూ.8.68 లక్షల విలువ గల సొత్తు స్వాధీనం

» ఆత్కూరు సర్కిల్‌లో తనిఖీల సందర్భంగా పట్టివేత

మధిరటౌన్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మధిర టౌన్ పోలీసులు ఓ అంతరాష్ట్ర దొంగను పట్టుకుని అతడి నుంచి రూ.8.68 లక్షల విలువ గల సొత్తును రికవరీ చేసినట్లు వైరా ఏసీపీ రెహమాన్ తెలిపారు. శనివారం మధిర సీఐ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు మధిర టౌన్ ఎస్‌ఐ సంధ్య అదనపు ఎస్‌ఐ చంద్రశేఖర్ ఉదయం 10గంటల ప్రాంతంలో ఆత్కూరు సర్కిల్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా కారులో ఉన్న ఓ వ్యక్తి అనుమానస్పదంగా వ్యవహరించడంతో తనిఖీ చేయగా అతని వద్ద ఖమ్మంలో అమ్మేందుకు తీసుకువెళుతున్న బంగారం లభించింది.

అతడిని అదుపు లోకి తీసుకొని విచారణ చేయగా అతడు కారు కిరాయికి తిప్పే మడుపల్లికి చెందిన బండి గోపి గా తెలిపాడు. ఇటీవల మధిర పట్టణంతో పాటు మండలంలో జరిగిన పలు వరస చోరీలకు పాల్పడినట్లు తెలిపాడు. ఇటీవల ఆత్కూరులో చోరి చేసిన లక్షన్నర నగదు తో పాటు, మడుపల్లి లో చోరి చేసిన రెండు లక్షల విలువ చేసే బంగారు నగల తో పాటు ముప్పయి వేల నగదు, మధిర టౌన్ పోలీస్ స్టేషన్ పరిది లోని ఏడు దొంగతనాల తో పాటు ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండల కేంద్రంలో ఒక దొంగతనం తో వత్సవాయి మండల కేంద్రంలో మరో దొంగతనంతో కలిపి మొత్తం తొమ్మిది దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు.

అతని వద్ద నుంచి 4.50 లక్షల విలువ చేసే 150 గ్రాముల బంగారం తో పాటు, 18వేల విలువగల 200గ్రాముల వెండి వస్తువులు, రెండు లక్షల నగదు తో పాటు 2లక్షల విలువ చేసే కెమేరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు మొత్తం రూపాయలు 8.68 లక్షల విలువ గల సొత్తును రికవరీ చేయడంతో పాటు నిందుతుడి సెల్ ఫోన్, కారును స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు.

నిందితుడిని పట్టుకొని అతడి నుండి అపహరణ సొత్తును రికవరీ చేసిన పోలీస్ సిబ్బందికి నగదు రివార్డును అందచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సిఐ మధు, టౌన్ ఎస్‌ఐ సంధ్య, అదనపు ఎస్‌ఐ చంద్రశేఖర్ కానిస్టేబుళ్లు లచ్చు, సుమన్, జనార్ధన్, సాయి, కృష్ణ హోంగార్డు రవి పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ముత్తారావు



కొణిజర్ల, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొణిజర్లకు చెందిన రోడ్డిబోయిన ముత్తారావు ఎన్నికయ్యాడు. ఆన్‌లైన్ ఓటింగ్ పద్ధతిలో సుమారు 70 కి పైగా ఓట్ల మెజార్టీతో ఎన్నికయ్యాడు. ముత్తారావు శుక్రవారం తనికెళ్లలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను కలిశాడు. దాంతో ఎమ్మెల్యే ముత్తారావుకు కాంగ్రెస్ జెండా కప్పి స్వీట్ తినిపించి అభినందించాడు. కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డే నారాయణరావు, రాంపుడి రోశయ్య, మాజీ ఎంపీపీ గోసు మధు, కోసూరి శ్రీను, చింతనిప్పు నరసింహరావు, కోట్టి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాయితేజకు కన్నీటి వీడ్కోలు

ఖమ్మం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో గుర్తుతెలియని దుండగుల కాల్పుల్లో మృతిచెందిన నూకారపు సాయితేజ(22)కు కుటుంబసభ్యులు, బంధువులు శుక్రవారం కన్నీటి వీడ్కోలు పలికారు. గత నెల 30న సాయితేజ అమెరికాలోని ఒక మాల్‌లో దుండగుల కాల్పుల్లో మృతిచెందిన విషయం విదితమే. ఈ క్రమంలో ఆయన మృతదేహం శుక్రవారం ఖమ్మంలోని రాపర్తినగర్‌కు చేరింది. కొడుకు మృతదేహాన్ని చూసిన వెంటనే తల్లిదండ్రులు కోటేశ్వరరావు, వాణి దంపతులు గుండెలు పగిలేలా రోదించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీటి పర్యంతం అయ్యారు. అంత్యక్రియలు నగరంలోని రామన్నపేటలో శుక్రవారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

వైరా, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో శనివారం ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి తెలిపారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా మండలంలోని తాటిపూడి, రెబ్బవరం, గొల్లెనపాడు, గొల్లపూడి గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని ఆయన వివరించారు.

నేడు ఆటోమోటర్ క్యాబ్ బంద్

వైరా, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో శనివారం జరిగే ఆటోమోటర్ క్యాబ్ బంద్‌ను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్.లాల్ మియా పిలుపునిచ్చారు. శుక్రవారం వైరాలో తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

జిల్లా సహకారశాఖ అధికారి గంగాధర్

ముదిగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా సహకారశాఖ అధికారి గంగాధర్ ఆదేశించారు. శుక్రవారం మేడేపల్లిలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తేమశాతం తక్కువ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి గిట్టుబాటు ధరతోపాటు రూ.500బోనస్ పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో శ్రీనివాసరావు, ఏఈవో మౌనిక, సిబ్బంది బిక్షం, రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు నేతల ఘన నివాళి



వైరాలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



సత్తుపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి



సత్తుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సండ్ర



నివాళులర్పిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల



మధిరలో మల్లు నందిని

కాంగ్రెస్ పాలనను విమర్శించే అర్హత సండ్రకు లేదు

కల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించటం తగదని కాంగ్రెస్ నాయకులు ఆక్షేపించారు. శుక్రవారం కల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాదేవి, కాంగ్రెస్ నాయకులు ఏనుగు సత్యంబాబు, కేవీఆర్ , పాపబత్తిని నగేష్, పెద్దబోయిన శ్రీనువాసరావులు మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, ధ్యేయంగా సతుపల్లి మహిళ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లు సేవలందిస్తుండగా మాజీ ఎమ్మెల్యే సండ్రకు కనిపించటక పోవటం విడ్డురంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే సత్తుపల్లి నియోజకవర్గంలో రూ.156 కోట్లతో పలు రకాలుగా అభివృద్ధి పనులు చేయటం జరిగిందని వారు వివరించారు. పది సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఒక మహిళ ఎమ్మెల్యేగా రాగమయి ఎంతోగాను అభివృద్ధి చేసేందుకు తగిన కార్యచరణతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. సమావేశంలో బాగం ప్రభాకరచౌదరి. యువజన కాంగ్రెస్ నాయకులు దారా రంగా, నాయకులు మరసకట్ల బాలశౌరి, మచ్చా వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, బాజీ పాల్గొన్నారు.

దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరు



ఉత్తర్వులు చూపిస్తున్న కాంగ్రెస్ నాయకుడు దానియేలు

వైరా, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలోని రైతులకు అందుబాటులో ఉండేవిధంగా దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనంగా మంజూరు చేసినట్టు రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దాసరి దానియేలు అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని గొల్లపూడి, విప్పలమడక, కొండకొడిమ గ్రామాలకు దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరైనట్లు వివరించారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ రైతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రస్తుతం ఉన్న గన్నవరం, తాటిపూడిలో ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తోన్న దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అదనంగా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి మరో మూడు కొనుగోలు కేంద్రాలు మంజూరు చేయటం జరిగిందన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బీడీకే.రత్నం, కాంగ్రెస్ నాయకులు పాలేటి నర్సింహారావు, బోళ్ల రంగారావు, నర్వనేని అశోక్, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతరాములు, ఏదునూరి శ్రీను, తోటకూర గోపి పాల్గొన్నారు.

'పేదలకు సాయం అభినందనీయం'

వైరా, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నారైలు మాతృభూమిలో నిరుపేదలకు సాయం అందించటం అభినందనీయమని వక్తలు కొనియాడారు. శుక్రవారం వైరాలో లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పర్పుల్ డీఎస్‌ఏ సొసైటీ ఆధ్వర్యంలో పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. మధు విద్యాలయాల చైర్మన్ మల్లెంపాటి వీరభద్రరావు మాట్లాడుతూ జీవనోపాధి కోసం ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు సహాయం చేయడం వల్ల వారి భవిష్యత్‌కు మార్గం చూపినట్లయిందన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రూ.35వేల విలువచేసే యూనిఫామ్‌లు, ప్రాథమిక పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.1.15లక్షల విలువ చేసే బాలవికాస్ ఉపకార వేతనాల ఆర్థికసహాయం అందించారు. 14మంది రైతులకు పవర్‌స్ప్రేయర్లు, దివ్యాంగులకు కుట్టుమిషన్లు, కిరాణ సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చిత్తలూరి శ్రీనివాసరావు, డాక్టర్ నాగసుధ, అఖిల్, చౌడవరపు బద్రీనారాయణ, కవితారాణి, డాక్టర్ రాంబాబు, సాయికిరణ్, మిట్టపల్లి భాస్కర్, హిమబిందు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదంటూ ముఖ్యమంత్రికి లేఖలు

రుణమాఫీ పూర్తిచేసేవరకు పోరుబాట

వైరా, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ కాలేదంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినూత్నంగా రైతులు లేఖల ద్వారా ఫిర్యాదు చేశారు. శుక్రవారం వైరా మండలం గన్నవరంలో రైతు రుణమాఫీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా రైతులు సీఎంకు లేఖలు రాశారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో లక్షమంది రైతులకుపైగా రుణమాఫీ కాలేదన్నారు. రూ.లక్షలోపు రుణం ఉన్న రైతులకు రుణమాఫీ పూర్తిచేయకుండానే రూ.రెండులక్షలలోపు రుణమాఫీ పూర్తయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడం వాస్తవాలను మరుగున పెట్టే ప్రయత్నమన్నారు. జిల్లాలో రైతులందరికి రుణమాఫీ చేసే బాధ్యత ముగ్గురు మంత్రులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు బాణాల శ్రీనివాసరావు, సాగునీటి సంఘం మాజీ చైర్మన్ వేమిరెడ్డి కోటిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు విజయలక్ష్మీ, బాణాల వెంకట్రావమ్మ, నాయకులు శీలం వెంకటరెడ్డి, కారుమంచి జయరాజు, తోట నాగేశ్వరరావు, సత్యం పాల్గొన్నారు.

పదేళ్లలో ఏం చేయలేదు.. ఏడాదిలో సాధ్యమా..

కాంగ్రెస్ నాయకుల విమర్శ

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో చేయని అభివృద్ధి ఏడాదిలోనే ఎలా సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ 10ఏళ్ల హయాంలో నియోజకవర్గానికి 1000ఇళ్లు ఇస్తే ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతలోనే నియోజకవర్గానికి సంక్రాంతికి 3500ఇళ్లు ఇవ్వనుందన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసిన ఆయన నియోజకవర్గానికి చేసిందేమీ లేదని, ప్రతిపక్ష నాయకుడుగా లేనిపోని విమర్శలు చేయడం తగదన్నారు. మూడు నెలలకోసారి చుట్టపుచూపుగా వచ్చి కారు కూతలు కూస్తే సహించేది లేదన్నారు. మట్టా దంపతులకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి విమర్శలు చేస్తే ఆ బీఆర్‌ఎస్ నాయకుడికి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఇద్దరు మంత్రుల పర్యటనలో భాగంగా విజయోత్సవ సభను జయప్రదం చేసిన ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పసుమర్తి చందర్‌రావు, చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, శివా వేణు, ఎండీ.కమల్‌పాషా, మందపాటి పద్మజ్యోతి, మట్టా చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

స్వయంపాలన ఆకాంక్షలకు ఊపిరిపోసిన కొమరయ్య

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వయంపాలన ఆకాంక్షలకు ఊపిరిపోసిన వ్యక్తి, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య పోస్టర్‌ను సత్తుపల్లిలో శుక్రవారం ఆవిష్కరించారు. ఇండియన్ పీపుల్స్ ఫిలిం ఫ్యాక్టరీ నిర్మిస్తున్న దొడ్డి కొమురయ్య చిత్ర సహనిర్మాతలు సత్తుపల్లిలో సందడి చేశారు. రింగ్ సెంటర్ నుంచి ర్యాలీగా బయల్దేరి చాకలి ఐలమ్మ, జ్యోతిబాపూలే, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో షేక్ అబ్దుల్ రహిమాన్, అల్లాడి రాము, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రాజకుమారి, పొన్నంపల్లి సలోని, ఝాన్సీరాణి, రెహానాసుల్తానా, నందిని, సుమలత, యామిని, షైమూద్, ఇమామ్, బెల్లంకొండ రాము, పాండు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు మల్లు నందిని అన్నదానం



అన్నదానం చేస్తున్న మల్లు నందిని

వైరా, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలి పూజల్లో భాగంగా స్థానిక హరిహరసుత అయ్యప్ప క్షేత్రంలో డిప్యూటీ సీఎం సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అయ్యప్పమాలధారులకు అన్నదానం చేయటం అదృష్టమన్నారు. హరిహరసుత అయ్యప్ప క్షేత్రం తమకు చాలా సెంటిమెంట్ అన్నారు. భట్టి విక్రమార్క ప్రతిసారి నామినేషన్‌కు ముందు ఇక్కడ పూజలు చేసిన తర్వాతనే నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. అనంతరం అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ కొప్పురావూరి వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి రంగా జనార్ధన్, ఫౌండర్ చైర్మన్ పెనుగొండ రామారావు, వైస్‌చైర్మన్ యండ్రపూడి శివశంకర్, కొప్పురావూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భూసార పరీక్షల కోసం పైలెట్ ప్రాజెక్టుగా తల్లాడ

తల్లాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూసార పరీక్షల కోసం తల్లాడ మండలం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైందని జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య అన్నారు. శుక్రవారం తల్లాడ మండలం మల్లవరం గ్రామంలోని రైతువేదికలో ఏఈవోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని వ్యవసాయ సాగుకు యోగ్యమైన మాగాణి, మెట్ట భూముల్లో ఏరియాల వారీగా మట్టి నమూనాలను సంబంధిత ఏఈవోలు సేకరించి ల్యాబ్‌కు పంపాలని సూచించారు. వరికోతలు, ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయిన తర్వాత మట్టి నమూనాల సేకరణపై ఏఈవోలు దృష్టిసారించాలని సూచించారు. సీసీఐ కేంద్రంలో పత్తి, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏఈవోలు కృషిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎండీ.తాజుద్దీన్, ఏఈవోలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కల్లూరు, డిసెంబరు 6 (ఆంధజ్యోతి) కల్లూరులో శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి డి పుల్లయ్య ఎరువుల దుకాణాలను సందర్శించి తనిఖీలు చేశారు. ఎరువుల దుకాణాల్లో నిల్వలు, స్టాక్ రిజిస్టార్‌ను పరిశీలించారు. అదే విధంగా పుల్లయ్యబంజరులో గ్రామంలో వరి కోయ్యలను తగల బెట్టడం చూసి పొలం గట్ల వద్ద ఆగి ఆయన రైతులతో మాట్లాడారు. వరి కొయ్యలను తగల బెట్టడం వల్ల వచ్చే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో కల్లూరు ఏఓ ఎం రూప రైతులు పాల్గొన్నారు.